ANN తెలుగు

Follow: @ANNTELUGU

31-08-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 233 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఎస్ఐఆర్ సెకండ్ ఫేజ్ చాలా కీలకం

- ఒక్క ఓట్ కూడా పోకుండా జాగ్రత వహించాలి
- ఎస్ఐఆర్ ఫేజ్-2 కోర్ కమిటీ సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి సూచనలు

**ఆదిలాబాద్ మహా :** ఎస్ఐఆర్ సెకండ్ ఫేజ్ లో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత బీఎల్ ఏ2 లు, సూపర్వైజర్లు, కోఆర్డినేటర్లు, కౌన్సిలర్ గా పోటీ చేసిన అభ్యర్థులు, మండల ,పట్టణ , వార్డ్ అధ్యక్షులు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల పై ఉందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్ 2 కోర్ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ రెండవ ప్రక్రియలో 8 5వేల మందికి నోటీసులు

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### యేషనాగుల కట్టమీద.. రికార్డులను దున్నేస్తున్న సాంగ్

- షేకవుతున్న సోషల్ మీడియా

03



### ఇరుముడి కలెక్షన్ల పూనకాలు

- 150కోట్లు.. 70లక్షలకు పైగా టికెట్లు
- రూ.150 కోట్ల రికార్డు షేర్‌తో తెలుగు సినిమా చరిత్రలో సంచలనంగా నిలిచిన 'ఇరుముడి'

02

### హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం

- ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల్లో నిర్మాణానికి సీఎం మెగా ప్లాన్
- డిసెంబరులో శంకుస్థాపనకు అవకాశం
- బీసీసీఐతో భాగస్వామ్యంపై కసరత్తు



02

# రేవంత్ సర్కార్ వెయ్యి రోజుల 'రైజింగ్'

## తెలంగాణకు కొత్త దిశ

- రైతు సంక్షేమం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు
- కొలువులు.. సంక్షేమం.. పెట్టుబడులు.. సంస్కరణలు
- వెయ్యి రోజుల పాలన.. 2047 లక్ష్యం
- తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా మార్చే ప్రణాళిక

( మొదటి పేజీ తరువాయి )

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1వ తేదీ నాటికి విజయవంతంగా 1000 రోజుల మైలురాయిని చేరుకుంది. ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని, సంక్షేమం-అభివృద్ధి-సామాజిక న్యాయాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లిన వెయ్యి రోజుల ప్రజాపాలన తెలంగాణ ప్రగతిలో కొత్త అధ్యాయాన్ని నమోదు చేసింది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చే పథకాల అమలుతో పాటు కొత్త చట్టాలు, కొత్త విధానాలు, కొత్త సంస్థలు, కీలక పరిపాలనా సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒకవైపు సంక్షేమ పథకాలతో పేదల కన్నీళ్లు తుడుస్తూనే, మరొకవైపు రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి అభివృద్ధి దిశగా ఉరకలెత్తిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దార్శనికతకు ఈ వెయ్యి రోజుల పాలన సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. రైతు సంక్షేమం నుంచి మహిళా సాధికారత వరకు, విద్య, వైద్యం, సామాజిక న్యాయం నుంచి డిజిటల్ పాలన, పెట్టుబడులు, మౌలిక వసతుల దాకా..

మిగతా 2వ పేజీలో






# నాలాలను తెగనమ్ముతున్న ఇరిగేషన్ అధికారులు...!

## నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న వైనం...!

### నాదెం చెరువు నాలాపై ఆగని అక్రమ నిర్మాణాలు...!



02

- నాలా మళ్లింపునకు 'డీఈఈ' ఎన్ఓసీ...!
- చట్టాన్ని ఖూనీ చేసిన ఇరిగేషన్ అధికారులు!
- ఇరిగేషన్ చట్టాలు, వాల్టా నిబంధనలకు పాతర..!"
- డీఈఈ అనుమతి ఇచ్చారు.. నాలా డైవర్షన్ చేసుకున్నాం" అని బాహాటంగా చెప్తున్న నిర్మాణదారుడు!
- తీవ్రస్థాయిలో మండిపడుతున్న కాలనీ వాసులు...!



### మేఘాలయలో మిత్రపక్షానికే బీజేపీ గాలం?

- యూడీపీకి చెందిన 9 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు ప్రచారం.
- అమిత్ షాతో భేటీతో మరింత వేడెక్కిన రాజకీయాలు.

02



# నేపాల్ విషాదం

788కు చేరిన మృతుల సంఖ్య

మొత్తం 2,500 మందికి పైగా గల్లంతు

02

### ప్రజల ఆకాంక్షలే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రూ.131.61 కోట్లతో మధిరలో అభివృద్ధి పనులకు శ్రీకారం.
- సంక్షేమం, విద్య, వైద్యం, రహదారులకు భారీగా నిధులు.
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.

02





### రాయలసీమ పల్లెల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- రూ.8,022 కోట్లతో గ్రామాలు, అటవీ అభివృద్ధి
- 23 వేలకుపైగా రోడ్ల పనులకు రూ.4,523 కోట్లు
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

02



### జగన్‌పై విజయసాయి ఆరోపణలు దురదృష్టకరం

- పబ్లిసిటీ కోసమే సాయిరెడ్డి వ్యాఖ్యలు.
- వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి.

02

### వైవిధ్యాన్ని గౌరవిస్తూనే ఏకత్వ భావనను కాపాడాలి

02

- 'ప్రపంచమంతా ఒకే కుటుంబం'.
- న్యూయార్క్ వేదికగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ సందేశం.





# నాలాలను తెగనమ్ముతున్న ఇరిగేషన్ అధికారులు...!



మహా, సిటీ బ్యూరో:
ప్రభుత్వ భూములను, సహజ వనరులను సంరక్షించాల్సిన రక్షకులే భక్షకులుగా మారితే ఇక సామాన్యుడికి దిక్కెవరు? చట్టాన్ని గౌరవించాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలిస్తే వ్యవస్థ ఎటు పోతుంది? జోడిమెట్ల పరిధిలోని నాడెం చెరువు నాలా పై జరుగుతున్న అక్రమ నిర్మాణాలు అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యానికి, లాలూచీకి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు కేవలం నామమాత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఒకవైపు నోటీసులు ఇచ్చామని అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమ నిర్మాణాలు రాత్రింబవళ్లు నిరాటంకంగా కొనసాగుతుండడం అధికారుల నిలువెత్తు లాలూచీకి అద్దం పడుతోంది.

**చట్టాన్ని ఖూనీ చేసిన డీఈఈ ఎన్ఓసీ!.. నాలా మళ్లింపునకు అధికారుల లాలూచీ!***

తెలంగాణ ఇరిగేషన్ చట్టాలు, వాల్టా నిబంధనల ప్రకారం సహజ సిద్ధమైన నాలాలను, వాగుల ప్రవాహాన్ని ప్రైవేట్ వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం మళ్లించడానికి ఇరిగేషన్ అధికారులకు ఎలాంటి చట్టపరమైన అధికారం లేదు. కానీ, జోడిమెట్లలో అక్రమార్కులకు ఇరిగేషన్ డీఈఈ ఆంజనేయులు అయాచితంగా రక్షణ కవచం తొడిగారు. నాలా ప్రవాహాన్ని మళ్లించుకోవచ్చంటూ తన పరిధి దాటి డీఈఈ ఎన్ఓసీ జారీ చేయడం వెనుక లక్షల రూపాయల ముడుపుల కథ దాగి ఉందని బాధితులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు."డీఈఈ అనుమతి ఇచ్చారు.. మేము నాలా డైవర్షన్ చేసుకున్నాం" అని నిర్మాణదారుడు బాహాటంగా చెప్తుండడం ఇక్కడి ఇరిగేషన్ అధికారుల లాలూచీకి నిలువెత్తు సాక్ష్యం. ఇరిగేషన్ చట్టాల ప్రకారం ప్రకృతి సిద్ధమైన నీటి ప్రవాహాల దిశను మార్చడం శిక్షార్హమైన నేరం. ఉన్నతాధికారుల సాంకేతిక కమిటీ లేదా ప్రభుత్వ ఉన్నత... స్థాయి నిర్ణయం లేకుండా, కేవలం ఒక ప్రైవేట్ వెంచర్ కోసం డీఈఈ ఇచ్చిన అనుమతులు చట్టం ముందు అస్సలు చెల్లవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉన్నతాధికారుల కమిటీకి మాత్రమే ఉండే అధికారాలను ఒక డీఈఈ ఏ ప్రాతిపదికన బిల్డర్‌కు ధారాదత్తం చేశారని, ఈ అక్రమ ఎన్ఓసీపై తక్షణమే క్రిమినల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

**జీవో 168, హెచ్ఎండీఏ బఫర్ జోన్ నిబంధనల ఉల్లంఘన!***

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బిల్డింగ్ రూల్స్ జీవో ఎం/ఎస్ నెం. 168, హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం నాలాలు, వాగుల పరిరక్షణకు కఠినమైన రూల్స్ ఉన్నాయి. నాలా వెడల్పును బట్టి దాని ఇరువైపులా కనీసం 9 మీటర్ల (లేదా అంతకంటే ఎక్కువ) పరిధిని బఫర్ జోన్‌గా వదిలిపెట్టాలి. ఈ బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి శాశ్వత లేదా తాత్కాలిక కాంక్రీట్ కట్టడాలు చేపట్టకూడదు. కానీ జోడిమెట్ల నాడెం నాలా విషయంలో ఈ చట్టాలు పూర్తిగా కాగితాలకే పరిమితమయ్యాయి. నాలా నడి బొడ్డున నాలా గర్భాన్ని మింగేస్తూ, బఫర్ జోన్‌ను పూర్తిగా ఆక్రమించి ఇరుకైన పిల్లర్లు లేపుతున్నా స్థానిక ఏఈఈ, డీఈఈలు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక లక్షలాది రూపాయల లాలూచీ దాగి ఉందని స్పష్టమవుతోందని స్థానికులు వాపోతున్నారు . జోడిమెట్ల నాడెం చెరువు నాలా కబ్జా వల్ల ప్రధానంగా హిమగిరి కాలనీ, డాక్టర్స్ కాలనీ, కాకతీయ కాలనీ, అన్నానగర్ కాలనీ, విజయసాయి కాలనీ, పోచారం కాలనీ, ఎమ్ఎల్ఆర్ కాలనీ, అరుంధతి కాలనీ, వెంకటేశ్వర కాలనీల ఉనికి తీవ్ర ప్రమాదంలో పడిందని, చిన్న వర్షానికే ఈ కాలనీలన్నీ జలమయం అవుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**న్యాయస్థానాల మైలురాయి తీర్పుల ఉల్లంఘన: అధికారుల మెడకు కోర్టు ధిక్కరణ ముప్పు!***

జోడిమెట్ల నాడెం నాలా వ్యవహారంలో స్థానిక ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రైవేట్ బిల్డర్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, గతంలో దేశ అత్యున్నత న్యాయస్థానంతో పాటు రాష్ట్ర హైకోర్టులు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను, స్పష్టమైన ఉత్తర్వులను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**జగ్‌పాల్ సింగ్ అండ్ అదర్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో సుప్రీంకోర్టు సంచలన ఆర్డర్:**

ఈ కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిస్తూ.. దేశంలో సహజసిద్ధమైన చెరువులు, నాలాలు, కుంటలు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన ఉమ్మడి భూములను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం మార్చకూడదని తేల్చి చెప్పింది. అక్రమ ఆక్రమణదారులు ఎంతటి రాజకీయ, ఆర్థిక బలవంతులైనా సరే, వారు భారీ ఖర్చుతో శాశ్వత కాంక్రీట్ కట్టడాలు కట్టినప్పటికీ, వాటిని తక్షణమే కూల్చివేసి తిరిగి ఆ భూమిని పూర్వ రూపంలోకి తేవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

**శ్రీ చంద్రమోహన్ రెడ్డి సోమిరెడ్డి వర్సెస్ స్టేట్ ఆఫ్ తెలంగాణ - 2026) జలవార్‌ఖాన్ చెరువు కేసు:**

అధికారుల అవినీతిపై మండిపడుతూ నేరుగా క్రైమ్ బ్రాంచ్‌క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించింది.

**(శ్రీమతి సుకైనా ఫాతిమా వర్సెస్ స్టేట్ ఆఫ్ తెలంగాణ- 2024) మూసి నాలా పరివాహక కేసు:**

నాలాలు, వాగుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులను నిర్ధారించే సర్వేలను ప్రైవేట్ వ్యక్తులు లేదా అక్రమ ఆక్రమణదారులు అడ్డుకోకూడదని హైకోర్టు ఖచ్చితమైన ఆర్డర్ ఇచ్చింది.

కోర్టుల నుంచి ఇన్ని స్పష్టమైన రూలింగ్స్ ఉన్నప్పటికీ, జోడిమెట్ల ఇరిగేషన్ అధికారులు డీఈఈ పరిధి దాటి నాలా మళ్లింపునకు ఎన్ఓసీ ఇవ్వడం నేరుగా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని చట్టపరమైన నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులపై బాధితులు, కాలనీ అధ్యక్షుల ఆగ్రహం !**

***ఇరిగేషన్ కమిషనర్‌కు సమగ్ర నివేదిక సమర్పిస్తాం !**నాడెం చెరువు నాలా ఉనికిని ప్రమాదంలో పడేసిన క్షేత్రస్థాయి అధికారుల అవినీతి లీలలపై కాలనీ ప్రతినిధులు ఇరిగేషన్ కమిషనర్‌కు సమగ్ర నివేదిక ఇస్తామని హెచ్చరించారు. బాధ్యత గల స్థానాల్లో ఉండి అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయనున్నారు. ఈ నివేదికలో గతంలో జరిగిన బదిలీల వివరాలను, బిల్డర్ల నుంచి అధికారులు దండిగా వసూలు చేసిన లీలలను కూడా స్పష్టమైన ఆధారాలతో పాటు పొందుపరిచినట్లు వెల్లడించారు.

**ఇరిగేషన్ అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..**

ప్రజల ప్రాణాలు పోయాకే మేల్కొంటారా? నాడెం చెరువు నాలా గర్భంలోనే అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయంటూ స్పష్టమైన ఆధారాలు లభిస్తున్నా, రాత్రింబవళ్లు పనులు జరుగుతున్నాయని స్థానికులు మొత్తుకుంటున్నా.. సంబంధిత అధికారులు మాత్రం మౌనం వీడకపోవడం పరిస్థితి తీవ్రతను, వారి వెనకునఉన్న లాలూచీని మరింత స్పష్టం చేస్తోంది. ఏఈఈ మౌనిక నామమాత్రపు పరిశీలన చేసి చేతులు దులుపుకున్నారే తప్ప, నిర్మాణాలను ఆపలేకపోయారు. దీంతో "ప్రజల ప్రాణాలా ముఖ్యమా..? లేక అక్రమ నిర్మాణాల వెనుక అందే ముడుపులు ముఖ్యమా..?" అనే ప్రశ్న ఇప్పుడు జోడిమెట్ల ప్రాంత ప్రజల నోట మారుమోగుతోంది.

***విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరపాలి!**

నిబంధనలను తుంగలో తొక్కి, వాల్టా చట్టం, జీవో 168ని తుంగలో తొక్కేలా అక్రమ నిర్మాణాలకు బాటలు వేసిన హెచ్ఎండీఏ అధికారుల పాత్రపై తక్షణమే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేత ఉన్నత స్థాయి విచారణ జరిపించాలి. 2026నాటి తాజా జలవార్‌ఖాన్ చెరువు కేసు తీర్పును బేస్ చేసుకుని, ఇరిగేషన్ అధికారులతో కలిసి తప్పుడు నివేదికలు సృష్టించి నాలా బఫర్ జోన్ పరిధిలో జారీ చేసిన హెచ్ఎండీఏ అనుమతులను తక్షణమే రద్దు చేయాలి.

అధికారులు ఇప్పటికైనా తమ కుంభకర్ణ నిద్ర వీడి తక్షణమే స్పందించాలి. నాడెం చెరువు నాలా అసలు హద్దులను అధికారికంగా గుర్తించి, ఆక్రమణలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అలా కాకుండా ఇదే మౌనాన్ని కొనసాగిస్తే.. రేపు మరో వరద విపత్తు సంభవించి కాలనీలు మునిగిపోయి, ప్రాణ నష్టం జరిగితే దానికి ఈ అవినీతి అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు, బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విపత్తు సంభవించిన తర్వాత మొసలి కన్నీరు కార్చడం కాదు.. ఇప్పుడే అక్రమ కట్టడాలను కూల్చివేసి నాలాను రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



**ధర్నాకు దిగుతాం.. హెచ్చరించిన పోచారం మాజీ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ కొండల్ రెడ్డి :**



నాడెం చెరువు నాలా పరిరక్షణకై స్థానిక ప్రజల పక్షాన పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి రంగంలోకి దిగారు. నాలాపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయకపోతే ఊరుకునేది లేదని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల వెనుక ఎంతటి రాజకీయ హస్తం ఉన్నా సరే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. లేనిపక్షంలో బాధ్యులైన ఇరిగేషన్ అధికారుల కార్యాలయం ముందు కాలనీ వాసులందరితో కలిసి భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని, అక్రమాలను అడ్డుకునే వరకు పోరాటం ఆపేది లేదని ఆయన అల్టిమేటం జారీ చేశారు.

**ఉమామహేశ్వర్ గౌడ్ (కాకతీయ కాలనీ ప్రతినిధి)**

"చిన్న వర్షానికే ఇక్కడ కాలనీలన్నీ జలమయం అవుతున్నాయి. రేపు భారీ వర్షాలు వస్తే మా ఇళ్ల పరిస్థితి ఏంటి? అధికారుల నిర్లక్ష్యానికి, స్వార్థానికి అమాయక ప్రజలు బలికావాలా? వాల్టా చట్టం, జీవో 168 ప్రకారం బఫర్ జోన్ వదిలిపెట్టకుండా అక్రమ కట్టడాలు కడుతుంటే కళ్లు మూసుకున్న ఇరిగేషన్ అధికారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**ఇ. రవికుమార్ (డాక్టర్స్ కాలనీ ప్రెసిడెంట్)**



"ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతూ బిల్డర్లకు పనులు పూర్తి చేసుకోవడానికి లోపాయికారీగా సమయం ఇస్తున్నారు. హెచ్ఎండీఏ జారీ చేసిన తప్పుడు అనుమతులను తక్షణమే రద్దు చేసి, నాలాను పూర్వ రూపానికి తీసుకురావాలి. రేపు ఏ ముంపు ముంచుకొచ్చినా దానికి డీఈఈ, ఏఈఈలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**జి. నాగరాజు (డాక్టర్స్ కాలనీ ప్రతినిధి)**



"ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ఇరిగేషన్ అధికారులు పూర్తిగా కబ్జాదారులకు ఏజెంట్లుగా మారిపోయారు. కాలనీ వాసుల రక్షణ కంటే వారికి అందుతున్న ముడుపులే ఎక్కువయ్యాయి. విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను కూల్చేవరకు మేము వెనకడుగు వేసేది లేదు.

**ఆకిటి కృష్ణారెడ్డి (హిమగిరి కాలనీ ప్రెసిడెంట్)**



"మా కళ్లముందే నాడెం చెరువు నాలాను మింగేస్తుంటే డీఈఈ అంజనేయులు నోటీసుల పేరుతో నాటకాలాడుతూ కాలయాపన చేయడం దారుణం. ఇరిగేషన్ అధికారుల పరోక్ష అండ చూసుకునే బిల్డర్లు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారు. జగ్‌పాల్ సింగ్ కేసులో 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక ఆర్డర్ వీరికి వర్తించదా? తక్షణమే ఉన్నతాధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకోకపోతే ఇరిగేషన్ అధికారుల అవినీతి బండారాన్ని ఆధారాలతో సహా బట్టబయలు చేస్తాం.

**"రమేష్ (ఎమ్ఎల్ఆర్ కాలనీ ప్రతినిధి)**

"నిబంధనల ప్రకారం నాలాల పక్కన ఎలాంటి కాంక్రీట్ కట్టడాలు చేపట్టకూడదు. కానీ ఇక్కడ రూల్స్ అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. బిల్డర్లు ఇష్టారాజ్యంగా పిల్లర్లు వేసి అంతస్థుల మీద అంతస్థులు లేపుతున్నా స్థానిక అధికారుల మౌనం వెనుక కోట్ల రూపాయల లాలూచీ దాగి ఉంది.

**ఎమ్. వెంకటేష్ (విజయసాయి కాలనీ ప్రతినిధి):**

"నాడెం చెరువు నాలాని మింగి నిబంధనలను ఇరిగేషన్ అధికారులే స్వయంగా తుంగలో తొక్కారు. నాలా ప్రవాహాన్ని ప్రకృతి విరుద్ధంగా మార్చడం వల్ల చుట్టుపక్కల కాలనీలు మునగడమే కాకుండా భూగర్భ జలాలు కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. అధికారులను సస్పెండ్ చేసే వరకు మా పోరాటం ఆపే ప్రసక్తే లేదు.

**కె. దయాకర్ (హిమగిరి కాలనీ ప్రతినిధి)**



"అక్రమ కట్టడాల యజమానుల నుంచి నెలవారీగా భారీ ఎత్తున ముడుపులు అందుతుండడం వల్లే ఇక్కడి అధికారులు డమ్మీలుగా మారిపోయారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రజా హక్కులను కాపాడాల్సిన వారే ఇలా కబ్జాదారులతో చేతులు కలిపి లాలూచీ పడడం సిగ్గుచేటు. ఈ అక్రమ వసూళ్ల పర్వంపై ఏసీబీతో పాటు ఉన్నత స్థాయి విచారణ జరిపించి దోషులను జైలుకు పంపాల్సిందే.



# యేషనాగుల కట్టమీద..

**రికార్డులను దున్నేస్తున్న సాంగ్**
**షేకవుతున్న సోషల్ మీడియా**

**హైదరాబాద్, మహా :** ది పారడైజ్ నుంచి విడుదలైన (యేష నాగుల కట్ట మీద.. ఏసిన ఉయ్యాల సాంగ్ రికార్డుల దుమ్ము దులిపేస్తుంది. విడుదలైన 24 గంటల్లోపే 20 మిలియన్లకు పైగా వ్యూస్ అందుకుని యూ ట్యూబ్ ట్రెండింగ్‌లో నెంబర్ వన్‌గా కొనసాగుతుంది.. సాంగ్ విడుదలైన క్షణం నుండి రికార్డుల వేట మొదలుకాగా, తెలుగురాష్ట్రాల్లో ఎక్కడ చూసిన యేషనాగుల వైబ్ తో ఊగిపోతోంది. ఆల్ టైం సాంగ్స్ లిస్ట్ లో దూసుకుపోతోంది. పాత రికార్డులన్నింటినీ ఏషనాగుల ఊచకోత కోసేస్తోంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ హైవోల్టేజ్ ఫోక్ మాస్ ఆంథమ్ మొదటి బీట్ నుంచే ఆకట్టుకుంటోంది. కాసర్ల శ్యామ్ రాసిన పక్కా లోకల్ తెలంగాణ ఫోక్ లిరిక్స్ 'ఏష నాగుల కట్ట మీద ఏసిన ఉయ్యాలా.. మనం ఊగుదామే బాలా' పాటకు ప్రాణంగా నిలిచాయి. ప్రభా బంగారిగళ్ళ, అద్దుల జంగిరెడ్డి తమ పవర్‌ఫుల్ జానపద గాత్రంతో పాటను మరో లెవెల్‌కు తీసుకెళ్లారు. వీడియోలో నాని తన ఊరమాస్ రా లుక్‌లో కనిపిస్తూ ఎనర్జిటిక్ మూమెంట్స్‌తో దుమ్ము రేపగా, కీర్తి సురేష్ చేసిన స్పెషల్ డ్యాన్స్ అండ్ గ్లామరస్ ఫోక్ స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ పాట ఓ వైపు సామాజిక మాధ్యమాలను దున్నేస్తుంటే.. మరోవైపు ట్రోలింగ్ కూడా అదే స్థాయిలో ఉంది. తాజా పాటకు సమకూర్చిన నృత్య రీతులు ఏమాత్రం సెట్ అవ్వలేదని దుయ్య బడుతున్నారు. అక్కడ వచ్చే పాటకు ఆ డ్యాన్స్ మూవ్‌మెంట్స్‌కి సంబంధమే లేదని అసలు పాటకు తగ్గట్లు డ్యాన్స్ బీట్స్ లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర హీరోల డ్యాన్స్ మూమెంట్స్ పెట్టి కూడా అభిమానులు ఎంజాయ్ చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ సెకండ్ ఫేజ్ చాలా కీలకం

( మొదటి పేజీ తరువాయి )

అందనున్నాయన్నారు.అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటు కూడా పోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బూత్ ల వారీగా నోటీసులు అందుకున్న వారి వివరాలు సేకరించి తగిన ధృవపత్రాలు ఎన్నికల కమీషన్ కు సమర్పించి ఓటు కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. తాను ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం లోని అనామలిస్ ఓట్ల పై దృష్టి సారించాలని సూచించారు. అర్హుల ఓట్లు ఎట్టి పరిస్థితులలో పోకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎన్నికలలలో డబ్బే ప్రధానం కాదన్నారు. మన మంచి మాట కూడా ప్రభావం చూపుతుందన్నారు. ఆదిలాబాద్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీ వాళ్లకు ఎలా సమాధానం చెప్పాలో తనకు తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరక్షరాస్యులకు నోటీసులొస్తే దగ్గరుండి ధృపపత్రాలు సమర్పించి ఓటు రక్షించాలన్నారు.అలాగే డ్రాఫ్ట్ జాబితాలో అర్హుడిగా భావించిన వారి పేర్లు లేకపోతే తిరిగి నమోదుకు ప్రయత్నించాలన్నారు. ముఖ్యంగా మైనారిటీలు,పేదలు, నిరక్షరాస్యులు తమ ఓటు హక్కును కోల్పోకుండా పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ,ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్ సంతోష్ రావు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ, లీగల్ సెల్ చైర్మన్ మంగేష్, నాయకులు గుడిపెల్లి నగేష్, మెహబూబ్ , సుధాకర్ గౌడ్, శాంతన్ రావు, అన్సార్, అడ్డి రుకేష్ రెడ్డి , రాందాస్ నాక్లే ,సోనియా మంథని, శ్రీలేఖ, జ్యోతి, షబానా ,బోనగిరి సంటెన్న, ఏనుగు రవీందర్ రెడ్డి, అల్చెట్టి నాగన్న, మండల అధ్యక్షులు వెంకన్న యాదవ్, బత్తుల శ్రీనివాస్, బాపూరావు, జగదీష్ రెడ్డి, రూప్ రావ్, సర్పంచ్లు వేణుగోపాల్, వామన్, దంతెల వినోద్ ఉప సర్పంచ్ గౌతమ్ రెడ్డి, అతిక్ , రఫిక్, చంద్రకాంత్, శంకర్, పొట్ట అశోక్, ప్రభాకర్, ఆశన్న, చందు, షకీల్, బండి సంజయ్, బండి సుదర్శన్ విశాల్, హాంజా, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఇరుముడి కలెక్షన్ల పూనకాలు

**150కోట్లు..70లక్షలకు పైగా టికెట్లు**

**హైదరాబాద్, మహా** ఇరుముడి.. కలెక్షన్లు, రికార్డులు ట్రేడ్ పండితులనే ఆశ్చర్యపరుస్తున్నాయి. భక్తి పవర్ చూపిస్తున్నాయి. జనం కేవలం సినిమా చూడటం లేదు... ఒక ఉత్సాహంతో, ఉద్వేగంతో థియేటర్ల వైపు పరిగెడుతున్నారు. 'ఇరుముడి' చిత్రం ప్రదర్శిస్తున్న భక్తి, ఆవేశం ఇప్పుడు ఒక సామూహిక సంచలనంగా మారి, బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో ఏకంగా 70 లక్షలకు పైగా టిక్కెట్లను విక్రయించేలా చేసింది. రెండవ వారంలోనూ డిజిటల్ స్క్రీన్ల నుంచి థియేటర్ల దాకా ఈ సినిమా సృష్టిస్తున్న దావానాలాన్ని ఏ శక్తి కూడా ఆపలేకపోతోంది. 150కోట్లకు రికార్డు షేర్ కలెక్ట్ చేసిన సినిమా తెలుగుసినిమా చరిత్రలోనే ఓ సంచలనంగా మారింది.




# వైవిధ్యాన్ని గౌరవిస్తూనే ఏకత్వ భావనను కాపాడాలి

**న్యూయార్క్, మహా :** భాషలు, మతాలు, ఆచారాలు, జీవన విధానాలు వేరైనా మానవాళి అంతా అంతర్లీనంగా ఒక్కటేనని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ప్రపంచంలో కనిపించే వైవిధ్యాన్ని తొలగించడం ఏకత్వం కాదని, భిన్నత్వాన్ని అంగీకరిస్తూ పరస్పర గౌరవంతో జీవించడమే భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందిస్తున్న అసలైన సందేశమని చెప్పారు. అమెరికాలోని న్యూయార్క్ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో నిర్వహించిన 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్'లో భారతీయ అమెరికన్ సమాజాన్ని ఉద్దేశించి ఆయన కీలక ప్రసంగం చేశారు.

'వసుధైవ కుటుంబకం' అంటే కేవలం ఆకర్షణీయమైన నినాదం కాదని, మానవ జీవన విధానానికి దిశానిర్దేశం చేసే భారతీయ తాత్విక భావన అని మోహన్ భాగవత్ వివరించారు. మనిషి తన కుటుంబం, సమాజం, దేశంతో పాటు ప్రపంచం పట్ల కూడా బాధ్యతతో వ్యవహరించినప్పుడే విశ్వమానవ ఏకత్వం సాకారమవుతుందని తెలిపారు. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి భౌతికంగా, మానసికంగా, అభిరుచుల పరంగా మరొకరికి భిన్నంగా ఉంటాడని, అయితే ఆ భిన్నత్వం వెనుక మానవత్వమనే ఉమ్మడి జీవధార ప్రవహిస్తోందని పేర్కొన్నారు.

వైవిధ్యాన్ని కేవలం సహించడమే కాకుండా గౌరవించాలని, స్వీకరించాలని, ఆనందంగా వేడుక చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అదే సమయంలో మనమంతా ఒకటేననే అంతర్గత భావనను మరచిపోకూడదన్నారు. భాషలు, మతాలు, దేశాలు, సంప్రదాయాల కారణంగా మనుషులు వేర్వేరుగా కనిపించినప్పటికీ, ఆకలి, ఆనందం, బాధ, ఆశలు, ఆత్మగౌరవం వంటి మానవ అనుభూతులు అందరిలోనూ ఒకేలా ఉంటాయని వివరించారు.

# మేఘాలయలో మిత్రపక్షానికే బీజేపీ గాలం?



**షిల్లాంగ్, మహా:** మేఘాలయ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) నేతృత్వంలోని కూటమిలో భాగస్వామిగా ఉన్న యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ)కి చెందిన పలువురు ఎమ్మెల్యేలు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. యూడీపీకి చెందిన తొమ్మిది మంది శాసనసభ్యులు పార్టీ మారే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో కూటమి రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. 60 మంది సభ్యులున్న మేఘాలయ అసెంబ్లీలో యూడీపీకి ప్రస్తుతం 12 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి ఇద్దరు సభ్యులున్నారు. యూడీపీ నుంచి కనీసం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒకేసారి బీజేపీలో విలీనమైతే.. మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల నిబంధనను అందుకునే అవకాశం ఉంటుంది. అలా జరిగితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాకుండా సమూహ విలీనం సాధ్యమవుతుందన్నది రాజకీయ వర్గాల అంచనా. ఫలితంగా అసెంబ్లీలో బీజేపీ బలం రెండంకెలకు చేరే అవకాశం ఉంటుంది. యూడీపీలో కొంతకాలంగా అసంతృప్తి పెరుగుతోందన్న ప్రచారం ఈ పరిణామాలకు నేపథ్యంగా నిలిచింది. ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు సన్నిహితుడిగా భావించే యూడీపీ అధ్యక్షుడు మెట్‌బా లింగ్డో నాయకత్వంపై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని భావిస్తున్న కొందరు శాసనసభ్యులు ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలను అన్వేషిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ఊహాగానాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో యూడీపీ ఎమ్మెల్యేల భేటీ మరింత ఆజ్యం పోసింది. ఇటీవల యూడీపీకి చెందిన పలువురు శాసనసభ్యులు అమిత్ షాను కలవడంతో వారు బీజేపీ వైపు చూస్తున్నారన్న ప్రచారం బలపడింది. అయితే ఈ భేటీకి రాజకీయ ఫిరాయింపులతో ఎలాంటి సంబంధం లేదని యూడీపీ వర్గాలు స్పష్టం చేశాయి. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ), రాష్ట్రానికి సంబంధించిన ఇతర అంశాలపై చర్చించేందుకే కేంద్ర హోంమంత్రిని కలిసినట్లు పార్టీ వివరణ ఇచ్చింది. మేఘాలయలో బీజేపీ, యూడీపీ రెండూ అధికార ఎన్‌పీపీ నేతృత్వంలోని కూటమిలో భాగస్వాములు కావడం తాజా పరిణామానికి మరింత రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తోంది. సాధారణంగా ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఆకర్షించడం ద్వారా బలాన్ని పెంచుకునే రాజకీయ వ్యూహాలు కనిపిస్తాయి. కానీ ఇక్కడ అధికార కూటమిలోనే ఉన్న మిత్రపక్ష ఎమ్మెల్యేలు బీజేపీ వైపు వెళ్లే అవకాశం ఉందన్న ప్రచారం తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. యూడీపీ నుంచి ఎనిమిది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరితే పరిస్థితి గణనీయంగా మారనుంది. ప్రస్తుతం ఇద్దరు ఎమ్మెల్యేలతో ఉన్న బీజేపీ బలం ఏకంగా పది మందికి చేరే అవకాశం ఉంటుంది. ఇది అసెంబ్లీలో పార్టీ రాజకీయ ప్రాధాన్యాన్ని గణనీయంగా పెంచుతుంది. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీకి మంత్రివర్గంలో మరిన్ని పదవులు కేటాయించాలనే డిమాండ్ కూడా అప్పుడే తెరపైకి వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ప్రస్తుతానికి యూడీపీ ఎమ్మెల్యేల ఫిరాయింపు విషయం అధికారికంగా ధ్రువీకరించబడలేదు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరుతున్నారన్న వార్తలు ప్రధానంగా రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలపైనే ఆధారపడి ఉన్నాయి. ఎమ్మెల్యేలు స్వయంగా తమ నిర్ణయాన్ని ప్రకటించే వరకు దీనిని నిర్ధారిత రాజకీయ పరిణామంగా పరిగణించడం సాధ్యం కాదు. యూడీపీ కూడా బీజేపీలో విలీనం అవుతున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. మేఘాలయ రాజకీయాల్లో సంఖ్యాబలం అత్యంత కీలకం. చిన్న రాష్ట్ర అసెంబ్లీలో కొన్ని ఎమ్మెల్యేల నిర్ణయం కూడా ప్రభుత్వ కూటమి సమీకరణాలను మార్చగలదు. అందుకే యూడీపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఒకేసారి పార్టీ మారితే దాని ప్రభావం కేవలం బీజేపీ బలం పెరగడానికే పరిమితం కాకుండా ఎన్‌పీపీతో ఉన్న కూటమి అంతర్గత సమీకరణాలపైనా పడే అవకాశం ఉంది. మరోవైపు యూడీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఎలా ఎదుర్కొంటుందన్నది కూడా కీలకంగా మారింది. ఎమ్మెల్యేలలో అసంతృప్తి నిజమైతే దాన్ని చక్కదిద్దేందుకు పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అసంతృప్త నేతలతో చర్చలు జరిపి వారిని పార్టీలోనే కొనసాగించే ప్రయత్నం చేయవచ్చు. అదే సమయంలో బీజేపీతో సంప్రదింపులు జరిగాయన్న అనుమానాలు కొనసాగితే కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య విశ్వాసంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. బీజేపీకి మాత్రం ఈ పరిణామం ఈశాన్య భారతదేశంలో తన రాజకీయ విస్తరణకు మరో అవకాశంగా మారవచ్చు. ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ తన సంస్థాగత బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. మేఘాలయలో యూడీపీ ఎమ్మెల్యేల మద్దతు లభిస్తే అసెంబ్లీలో బీజేపీ స్వతంత్ర రాజకీయ బలం గణనీయంగా పెరుగుతుంది. భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా కూడా ఇది పార్టీకి వ్యూహాత్మక ప్రయోజనాన్ని కలిగించే అవకాశం ఉంది. అయితే యూడీపీ ఎమ్మెల్యేల సమూహ విలీనం జరిగితేనే ఈ పరిణామం ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి రక్షణ పొందుతుందన్న అంశం కీలకం. వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలు పార్టీ మారితే అనర్హత వేటు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల మూడింట రెండొంతుల సభ్యుల మద్దతుతో సమూహంగా విలీనం చేయాలన్న వ్యూహం ఉంటేనే అది చట్టపరంగా నిలబడే అవకాశం ఉంటుంది. ఇదే కారణంగా యూడీపీకి చెందిన కనీసం ఎనిమిది మంది ఎమ్మెల్యేల సంఖ్య ప్రస్తుత చర్చల్లో కీలకంగా మారింది.

# వెయ్యి రోజుల పాలనలో సాధించిన విజయాలు

**( మొదటి పేజీ తరువాయి )**

ప్రభుత్వం చేపట్టిన ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్ ముఖచిత్రాన్ని మార్చేస్తోంది. వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు, విద్య నుంచి వైద్యం వరకు, మహిళా సాధికారత నుంచి యువత ఉపాధి వరకు, సామాజిక న్యాయం నుంచి డిజిటల్ పాలన వరకు ప్రతి రంగంలో కొత్త నిర్ణయాలు తీసుకుంది. భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగ అవకాశాలను విస్తరించడం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలకు బాటలు వేయడం, భవిష్యత్తు తెలంగాణకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించింది.

1. 202526లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక; దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం.
2. రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ; 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తి.
3. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం; ఒకే విడతలో 9 రోజుల్లో దాదాపు రూ.9 వేల కోట్ల జమ.
4. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అమలు.
5. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, రైతు బీమా, పంట నష్టపరిహారంతో రైతులకు భరోసా.
6. 32 నెలల లెక్కల ప్రకారం వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.68 లక్షల కోట్ల వ్యయం.
7. వరి సాగు, ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి దేశంలో నంబర్-1గా తెలంగాణ.
8. గత యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు; 13.37 లక్షల రైతులకు రూ.18,929 కోట్ల చెల్లింపు.
9. రెండు సీజన్లలో 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు; రైతులకు రూ.35,077 కోట్ల చెల్లింపు.
10. తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ; ఫిలిప్పీన్స్‌కు 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం.
11. ఇందిరా సౌర గిరిజల వికాసం కింద 2.10 లక్షల గిరిజన రైతులకు ప్రయోజనం కల్పిస్తూ 6 లక్షల ఎకరాల పోడు భూములకు సాగునీటి లక్ష్యంతో రూ.12,600 కోట్ల కార్యక్రమం.
12. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ; తుమ్మడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం.
13. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం; 335 కోట్లకుపైగా ఉచిత ప్రయాణాలు, దాదాపు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా.
14. గృహజ్యోతి కింద 53 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు; 10 కోట్లకుపైగా జీరో బిల్లులు.
15. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్.
16. కల్యాణలక్ష్మి ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం.
17. 4.54 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజీ; రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ.
18. మహిళా సంఘాలకు పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోలు బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి ఆదాయ వనరుల కల్పన.
19. 15 లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డుల జారీ.
20. కొత్త రేషన్ కార్డులు, సభ్యుల చేరికల ద్వారా లక్షలాది మందిని అదనంగా ఆహార భద్రత పరిధిలోకి తీసుకురావడం.
21. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం.
22. దాదాపు 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రత.
23. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ; ప్రజా పంపిణీ వ్యవస్థలో కొత్త విధానానికి శ్రీకారం.
24. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం; ఒక్కో అర్హ కుటుంబానికి రూ.5 లక్షల సహాయం.
25. హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి నిర్ణయం.
26. 43.01 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు; డిసెంబర్ 2023 నుంచి జూలై 2026 వరకు రూ.30,089 కోట్ల వ్యయం.
27. సామాజిక భద్రతను మరింత విస్తరిస్తూ కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు.
28. రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్లకుపైగా కుటుంబాలను కవర్ చేస్తూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పూర్తి.
29. సర్వే ఆధారంగా కులాల వారీ సామాజిక, ఆర్థిక స్థితిగతుల వెల్లడి.
30. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరణ.
31. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేసిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ.
32. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు శాసనసభ ఆమోదం; కేంద్రానికి పంపింపు.
33. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో 12.4 శాతం కేటాయింపు.
34. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణ; దాదాపు కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం.
35. నైపుణ్యం లేని కార్మికులకు రూ.16 వేలు, సెమీ స్కిల్డ్‌కు రూ.17 వేలు, స్కిల్డ్‌కు రూ.18,500, హైలీ స్కిల్డ్‌కు రూ.20 వేల కనీస నెలవారీ వేతనం.
36. గిగ్ కార్మికులకు చట్టబద్ధ గుర్తింపు, సంక్షేమ బోర్డు, సంక్షేమ నిధి, సామాజిక భద్రత కల్పించే ప్రత్యేక చట్టం.
37. వృద్ధ తల్లిదండ్రులు నిరాదరణకు గురికాకుండా కుటుంబ బాధ్యతను బలోపేతం చేసే ప్రత్యేక చట్టం.
38. ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షను అరికట్టేందుకు రోహిత్ వేముల తెలంగాణ బిల్లుకు రూపకల్పన.
39. పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి పురోగతి.
40. ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ లక్ష్యంతో 105 స్కూళ్ల మంజూరు.
41. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 84కు అనుమతులు ఇచ్చి నిర్మాణ ప్రక్రియ వేగవంతం.
42. ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా ప్రీప్రైమరీ తరగతుల ప్రారంభం.
43. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లతో ప్రభుత్వ విద్యకు కొత్త నమూనా.
44. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 22 లక్షలకుపైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం; రూ.720 కోట్ల కేటాయింపు.
45. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం.
46. సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలు 212 శాతం పెంపు.
47. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం.
48. దాదాపు 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్.
49. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను యాజమాన్యాల ప్రమేయం లేకుండా నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం.
50. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్ల కేటాయింపు.
51. ప్రజా ప్రభుత్వ హయాంలో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు.



52. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, డీఎస్సీ సహా కీలక నియామక ప్రక్రియల పూర్తి.
53. టీజీపీఎస్సీ ద్వారా మరో 456 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు.
54. పోలీసు నియామక బోర్డు ద్వారా 7,437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు.
55. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు.
56. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో 1,190 మంది అధునాతన నైపుణ్య శిక్షణ పూర్తి; 838 మందికి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు.
57. 65 ప్రభుత్వ ఐటీఐలు, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దడం.
58. టీహబ్, టీవర్క్స్, టాస్క్, వీహబ్ ద్వారా 90 వేలకుపైగా యువతకు నైపుణ్య శిక్షణ.
59. డీట్ జాబ్స్ ప్లాట్‌ఫాంలో 1.43 లక్షల మంది ఉద్యోగార్థుల నమోదు.
60. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో జాబ్‌మేళాల ద్వారా 40 వేల మంది యువత నమోదు; 5,700 నియామక పత్రాలు.
61. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు.
62. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌తో క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణ.
63. రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు.
64. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో 2,000 పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం.
65. సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం. అల్వాల్, ఎల్బీ నగర్‌లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు.
66. తొమ్మిది కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రారంభం; మరో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం.
67. నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయి; దాదాపు 1,900 మందికి ఉచిత చికిత్స.
68. ప్రభుత్వ వైద్యరంగంలో దక్షిణ భారత తొలి రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ నిమ్స్‌లో నిర్వహణ.
69. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5,18,186 మందికి రూ.2,526.12 కోట్ల సహాయం.
70. సీఎంఆర్ఎఫ్ వైద్య రీయింబర్స్‌మెంట్ ద్వారా 4,78,789 మంది పేద రోగులకు రూ.1,635.34 కోట్ల సహాయం; 39,712 మందికి రూ.798.41 కోట్ల ఎల్ఓసీలు.
71. వివిధ విపత్తులు, ఆపద పరిస్థితుల్లో చిక్కుకున్న 225 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.92.37 కోట్ల ప్రత్యేక సాయం.
72. ఆహార కల్తీ, డ్రగ్స్ ముప్పును సమగ్రంగా ఎదుర్కొనేందుకు కొత్తగా టీ సేఫ్ ఏర్పాటు.
73. ఆహార కల్తీ నియంత్రణ, డ్రగ్స్ నియంత్రణను ఒకే వ్యవస్థ కిందకు తీసుకొచ్చి విస్తృత తనిఖీలు, దాడులు నిర్వహించేలా టీ సేఫ్‌కు ప్రత్యేక అధికారాలు.
74. టీ సేఫ్‌కు ప్రత్యేక లీగల్, ల్యాబొరేటరీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు; కల్తీదారులు, డ్రగ్స్ నేరస్థులపై కఠిన చర్యలకు సమగ్ర వ్యవస్థ.
75. మాదకద్రవ్యాలపై ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థ ఏర్పాటు చేసి డ్రగ్ నెట్‌వర్కులపై కఠిన చర్యలు.
76. పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో యాంటీ డ్రగ్ అండ్ సేఫ్టీ కమిటీలను తప్పనిసరి చేసే నిర్ణయం.
77. విద్యాసంస్థల్లో క్యాంపస్ కోఆర్డినేటర్లు, స్పాటర్లను నియమించి విద్యార్థుల్లో ప్రవర్తనా మార్పులను ముందుగానే గుర్తించే వ్యవస్థ.
78. డ్రగ్స్ నియంత్రణలో బాధ్యత వహించని విద్యాసంస్థల గుర్తింపుపై చర్యలు తీసుకునే విధానం.
79. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక పోలీసింగ్, 1930 స్పందన వ్యవస్థ బలోపేతం.
80. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లతో మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు.
81. భరోసా ప్రాజెక్టు ద్వారా బాలల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ముందడుగు.
82. పట్టణ ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కొత్తగా టీజీ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు.
83. హైవేలు, ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రత్యేక పెట్రోలింగ్, ప్రమాదాల నివారణకు కొత్త వ్యవస్థ.
84. భూ భారతి చట్టంతో భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు.
85. భూధార్ ద్వారా భూములకు ప్రత్యేక గుర్తింపు, ఏఐ ఆధారిత భూమిత్ర సేవల ప్రారంభం.
86. 3.76 లక్షల కొత్త పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ.
87. ప్రజాపాలన-అభయహస్తం ద్వారా గ్రామాలు, వార్డుల్లోనే ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ.
88. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో 12,758 గ్రామసభలు, 3,175 వార్డుసభల నిర్వహణ.
89. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో 1,06,598 పెండింగ్ ప్రభుత్వ ఫైళ్ల పరిష్కారం.
90. అదే కార్యక్రమంలో 76 వేలకుపైగా రైతులను సూక్ష్మ సాగునీటి పరిధిలోకి తీసుకురావడం.
91. 8 వేల ఇంటిగ్రేటెడ్ మహిళా శక్తి భవనాలకు శ్రీకారం.
92. రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి తర్వాత అన్ని ఎంపీడీవో కార్యాలయాలకు మండల ప్రజావాణి విస్తరణ.
93. ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులందరినీ ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉంచే మండల ప్రజావాణి వ్యవస్థ.
94. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా అర్జీలు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్ ఏర్పాటు నిర్ణయం.
95. ప్రజావాణి అర్జీల పరిష్కార పురోగతిని ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్‌బోర్డు ఏర్పాటు నిర్ణయం.
96. ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా ఆర్థిక క్రమశిక్షణ.
97. కొన్నేళ్లుగా పేరుకుపోయిన రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల్లో వంద రోజుల్లో రూ.6,000 కోట్ల చెల్లింపు.
98. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ ద్వారా క్యాష్‌లెస్ వైద్య సేవలు.
99. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈఆఫీస్ అమలు.
100. దేశంలో తొలి పూర్తిస్థాయి డిజిటల్ కేబినెట్ నిర్వహణ.
101. వాట్సాప్ ద్వారా 581కిపైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం.
102. దేశంలో తొలి స్టేట్ ఏఐ డేటా ఎక్స్ఛేంజ్-టీజీడెక్స్ ఏర్పాటు; 21 రంగాల్లో 52 ఏఐ ప్రాజెక్టులకు మద్దతు.
103. టీఫైబర్ ద్వారా భారత్‌నెట్ రెండో దశలో 8,895 గ్రామ పంచాయతీలకు డిజిటల్ కనెక్టివిటీ.
104. ప్రభుత్వ ఆదాయ లీకేజీలను అరికట్టేందుకు విజిలెన్స్, పౌరసరఫరాల శాఖల్లో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు.
105. పౌరసరఫరాలు, మైన్స్ అండ్ మినరల్స్, జీఎస్టీ తదితర రంగాల్లో ఆదాయ నష్టాలు, ఎగవేతలపై ప్రత్యేక నిఘా.
106. హైదరాబాద్ చుట్టూ దాదాపు 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు.
107. రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల హ్యామ్ రోడ్ల అభివృద్ధి.
108. హైదరాబాద్ మెట్రో రెండో దశలో ఏడు కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరణ ప్రణాళిక.
109. హైదరాబాద్ చుట్టూ రేడియల్ రోడ్ల విస్తరణ.
110. మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ.
111. ఆదిలాబాద్‌లో జాయింట్ యూజ్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి.
112. హైడ్రా ద్వారా చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ; 1,045 ఎకరాల భూముల స్వాధీనం, దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ.
113. బతుకమ్మకుంట, నల్లచెరువు సహా పలు చెరువుల పునరుద్ధరణ.
114. మూసీ పునరుజ్జీవనానికి 55 కిలోమీటర్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక.
115. మూసీ పరిధిలో 39 కొత్త ఎస్టీపీల నిర్మాణం.
116. గోదావరి నుంచి 2.5 టీఎంసీల స్వచ్ఛమైన నీటిని మూసీకి తరలించే ప్రణాళిక.
117. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ-2025 ద్వారా పాత పారిశ్రామిక ప్రాంతాల పునర్వ్యవస్థీకరణ.
118. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్-2024లో కీలక విభాగాల్లో తెలంగాణ టాప్ అచీవర్.
119. టీజీఐపాస్ ద్వారా 26,608 యూనిట్లకు రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదాలు.
120. టీజీఐఐసీ భూముల్లో రూ.92,281 కోట్ల పెట్టుబడులు; 78 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలకు మార్గం.
121. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో 100 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు.
122. హైదరాబాద్‌లో సాఫ్రాన్-సీఎఫ్ఎం విమాన ఇంజిన్ నిర్వహణ, మరమ్మతు కేంద్రానికి మార్గం.
123. నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ-202630; రూ.73,360 కోట్ల పెట్టుబడులు, 3.5 లక్షల ఉద్యోగ అవకాశాల లక్ష్యం.
124. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కొత్త విధానం.
125. రూ.2,060 కోట్ల యూనిటీ మాల్ నిర్మాణ ప్రణాళిక.
126. రూ.2,049 కోట్ల మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్ అభివృద్ధి.
127. 202627లో ఇప్పటివరకు రూ.12,350 కోట్ల ఎలక్ట్రానిక్స్ పెట్టుబడులు.
128. సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్‌కు ప్రత్యేక ప్రోత్సాహం.
129. ఫోటానిక్స్ వ్యాలీలో రూ.5,500 కోట్ల పెట్టుబడి పైప్‌లైన్.
130. 202526లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరిక; ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలు.
131. హైదరాబాద్‌లో 355కిపైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు; 2026లోనే మరో 40 కొత్త కేంద్రాలు హైదరాబాద్‌ను ఎంచుకోవడం.
132. డేటా సెంటర్లు, క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన కేంద్రంగా తెలంగాణ.
133. అమెజాన్ నుంచి తెలంగాణకు అదనంగా 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి.
134. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి ప్రాంతాల్లో భారీ హైపర్‌స్కేల్, ఏఐరెడీ క్లౌడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి.
135. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి సమగ్ర టూరిజం పాలసీ-2025 అమలు.
136. ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యానికి మించి తొలి ఏడాదిలోనే రూ.23,174 కోట్ల పెట్టుబడి పైప్‌లైన్; 42 అవగాహన ఒప్పందాలు.
137. యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో దేశంలో నంబర్-1గా తెలంగాణ.
138. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 202526లో రూ.101.93 కోట్ల ఆదాయం, రూ.13.35 కోట్ల నికర లాభం.
139. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ ఆత్మనిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డులో దేశంలో మొదటి స్థానం; రూ.1 కోటి పురస్కారం.
140. 'జయ జయహే తెలంగాణ' గీతానికి అధికారిక గౌరవం.
141. తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ.
142. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి, వారి కుటుంబాలకు సముచిత గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు.
143. తెలంగాణ రైజింగ్-2047 కింద 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యం.
144. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యం.
145. క్యూర్-కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, ప్యూర్-పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రేర్-రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ అనే మూడు అభివృద్ధి వలయాలతో రాష్ట్ర సమగ్ర ప్రణాళిక.
146. భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్ జీరో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసే నిర్ణయం.
147. భారత్ ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ, డేటా సెంటర్లు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రపంచస్థాయి కేంద్రం ఏర్పాటు.

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ | 31-08-2026



## ఆహ్వానము

మూసీ సాహిత్య ధార ఆధ్వర్యంలో
శ్రీమతి ధూళిపాళ అరుణ రచించిన

"విమర్శాదర్శ విమర్శాదర్శము"
(డా. ఏల్చూరి మురళీధరరావు గారి "
వ్యాస ఘట్టాలు" సమగ్ర విమర్శ)

పుస్తకావిష్కరణ & అంకితోత్సవం

తేదీ: సెప్టెంబర్ 2, 2026, సాయంత్రం 5 గంటలకు
వేదిక: సురభారతి, ఎన్. సి.సి. గేటు పక్కన ఉస్మానియా విశ్వవిద్యాలయం

**ముఖ్య అతిథి, ఆవిష్కర్త**
ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు
(విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త, సుప్రసిద్ధ కవి)

**సభాధ్యక్షులు**
డా. రేవూరి అనంత పద్మనాభరావు గారు
(పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ)

**ఆత్మీయ అతిథి, పుస్తక విశ్లేషకులు**
శ్రీ పరిమి శ్రీరామనాథ్ గారు
సుప్రసిద్ధకవి, బహుభాషా విద్వాంసులు

**విశిష్ట అతిథులు**
శ్రీ విహారి గారు
ప్రముఖ కవి, సుప్రసిద్ధ సాహితీవేత్త
ఆచార్య తాడేపల్లి పతంజలి గారు
ప్రముఖ సాహితీవేత్త, ప్రవచన ప్రవీణులు, ప్రిన్సిపాల్ (రి)
ఆచార్య సాగి కమలాకరశర్మ గారు
తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

**కృతి స్వీకర్త**
డా. ఏల్చూరి మురళీధరరావు గారు
ప్రసిద్ధ కవి, రచయిత, సంస్కృతాంధ్రాంగ్ల పండితులు

గుడిపాటి
పాలపిట్ట

## రూపాంతరం

ఒకప్పుడు
ప్రశ్నకు కొడవలి ఆకారం ఉండేది,
పొలాల నిశ్శబ్దాన్ని కోసేది.

తర్వాత
అది గాజు గ్లాసై వచ్చింది,
ప్రతిబింబాలనే విచారించింది.

ఇప్పుడు
బొద్దింక రూపంలో గోడలెక్కుతోంది,
చీకటి మూలల్లో దాచిన నిజాలను తడుముతోంది.
రూపం మారిందని
ప్రశ్నను చెత్తబుట్టలో వేయలేరు;

ఎందుకంటే
కొడవలి, గ్లాసు, వస్తువులు;
బొద్దింక కీటకమే,
అసలు భయం వాటి వెనుక నడిచే సందేహానిది.

కాలం
ప్రశ్నలకు పేర్లు మారుస్తుంది,
సమాధానాల నుంచి తప్పించుకునే వారే వాటికి ముద్రలు వేస్తారు.
ప్రశ్న ఒక దీపమైతే
జవాబులు దాన్ని ఆర్పే గాలిగా మారుతున్నాయి..!

**డా పెరుగు రామకృష్ణ**
**9849230443**

# కవిత్వమా? నిప్పుతో ఆడుకోవడమే!

"కవిత్వంలో నేను విషయాన్ని పారాగ్రాఫ్ ఉపన్యాసంలా నేరుగా చెప్పలేను ; అలా చెబితే అది ప్రసంగం అవుతుంది. కవిత్వానికంటూ ఒక స్వంత భావ ప్రకటనా భాష ఉంటుంది" అని నమ్మి, ఆ నమ్మకానికి అచ్చమైన ఉదాహరణలుగా తన కవిత్వాన్ని మలచుకున్న కవి జ్ఞాన్ పూజారి.

కవిత్వమా? నిప్పుతో ఆడుకోవడమే......!
ఉదయపు వేళ చెట్లు తమ ఆకులను చాపుతూ
మాకు కవిత్వం కావాలి అన్నాయి.
కవిత్వమా? నిప్పుతో ఆడుకోవడమే!

రక్తహీనతతో ఉన్న ఈ ప్రపంచంలో
చేతి నుంచి పసిపాప జారిపడిపోతోంది,
తల్లి దానిని గమనించడం కూడా లేదు.

బయట నిరంతరం మెరుపుల ఉరుములు,
అయినా సరే నీకు ఇంకా కవిత్వమే కావాలా?

కవిత్వమా?
నేను నిప్పుతోనే ఆడుకుంటాను... ఈ రోజుకూడా!

'అభివాదం' అనే శీర్షికన ఆయన రాసిన ఈ కవితతోనే తన కవితా దృక్పథాన్ని స్పష్టం చేశారు. జ్ఞాన్ పూజారి ఆధునిక అస్సామీ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి చెందిన కవులలో ఒకరు. సామాజిక స్పృహ, మానవీయ దృక్పథం ఆయన కవిత్వానికి ముఖ్య లక్షణాలు. 1948లో అస్సాంలోని బిశ్వనాథ్ జిల్లా గోపూర్‌లో జన్మించిన పూజారి, కవిత్వాన్ని కేవలం అందమైన భావాలకే పరిమితం చేయకుండా వర్తమాన సామాజిక వాస్తవాలను, సమస్యలను ప్రతిబింబించే సాధనంగా మలిచారు. దిబ్రూగఢ్ విశ్వవిద్యాలయం నుండి అస్సామీ సాహిత్యంలో స్నాతకోత్తర విద్యనభ్యసించిన ఆయన, కవిగానే కాకుండా నాటకకర్తగా, అనువాదకుడిగా, సినిమా విమర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు.

2016లో జ్ఞాన పూజారి రాసిన 'మేఘమలార్ భ్రమణ్' అనే అస్సామీ కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. డిసెంబర్ 2013లో ప్రచురితమైన ఈ సంపుటి, ఆయన పరిణతి చెందిన ఆలోచనా విధానానికి నిదర్శనం. 'మేఘమలార్ భ్రమణ్' అంటే "మేఘాల మాలలు చేసే ప్రయాణం" అని అర్థం. ఆకాశంలో నిరంతరం కదిలే మేఘాలలాగే ఆయన కవిత్వం కూడా వైయక్తిక అనుభవాల నుండి సమాజం వైపు, జ్ఞాపకాల నుండి చరిత్ర వైపు, నిరాశ నుండి పరివర్తన వైపు ప్రయాణిస్తుంది.

పూజారి కవిత్వానికి ప్రధాన బలమైన సామాజిక చైతన్యం ఆయన ప్రతి రచనలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. పేదరికం, దోపిడీ, అసమానతలు ఆయన కవితల్లో కేవలం రాజకీయ పదాలు కావు; అవి సామాన్య ప్రజల నిత్య జీవిత అనుభవాలు. సమాజంలో మూలనపడిన టీ తోటల కార్మికులు, రైతులు, శ్రామికులు, మహిళలు, పిల్లల కష్టాలను ఆయన అత్యంత ఆర్ద్రతతో చిత్రించారు. అస్సాం నేలతో, అక్కడ ప్రజలతో ఆయనకున్న అనుబంధం వల్లనే ఒక అస్సామీ రైతు లేదా కార్మికుడి కష్టం ఆయన కవిత్వంలో సార్వజనీన మానవ పోరాటంగా రూపాంతరం చెందుతుంది.

టక్ టక్ టక్... అర్ధరాత్రి వేళ తలుపు తట్టిన శబ్దం.
తల్లి కొడుకు వైపు, కొడుకు తండ్రి వైపు,
తండ్రి తన ముద్దుల కూతురి వైపు భయం భయంగా చూశారు.

"ఏం భయం లేదు, పొద్దున్నే వచ్చేస్తాడు... చిన్న విచారణే, చిన్న విచారణే."

"విచారణ," తల్లి గొణిగింది. ఏమి జరుగుతోంది? ఏమిటి?
తల్లి తల దించుకుంది, తండ్రి తన ముద్దుల కూతురి వైపు చూశాడు.




కూతురు అంది: "విచారణ జరుగుతోంది."
"విచారణ," ప్రజలు గుసగుసలాడారు.

టక్ టక్ టక్... ప్రజలు చుట్టూ చేరారు గుంపుగా,
ప్రజలు గుంపులుగా మారారు.
ఇంకా వాళ్లంటున్నారు - "విచారణ జరుగుతోంది."
అవును, మేము ప్రశ్నలు అడగాలనుకుంటున్నాము!

'నైట్ బ్లాసమ్స్' అనే శీర్షికన రాసిన ఈ కవిత జ్ఞాన్ పూజారి ప్రాతినిధ్య కవిత (Representative Poem). ఈ చిన్న కవిత అధికార యంత్రాంగం దాష్టీకం, రాజ్య అణచివేత నేపథ్యంలో సామాన్య ప్రజల భయాన్ని ఎంత బలంగా వ్యక్తీకరించిందో చెబుతుంది.



'విచారణ' పేరుతో సామాన్యులను అర్ధరాత్రి తీసుకెళ్లే భయాందోళనలను ప్రదర్శిస్తూనే, కవిత ముగింపులో "ఇప్పుడు మేమే మిమ్మల్ని ప్రశ్నించాలనుకుంటున్నాము" అంటూ ప్రజలలో వ్యక్తమయ్యే ప్రతిఘటనను, చైతన్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

జ్ఞాన్ పూజారి కవిత్వంలో ఈ విప్లవాత్మక స్పృహ కేవలం రాజకీయ నినాదాల నుండి కాక, పీడిత వర్గాలపై ఉన్న అపరిమితమైన ప్రేమ నుండి, మానవత్వం నుండి ఉద్భవిస్తుంది. హింస, అణచివేత, నైరాశ్యాల నడుమ కూడా మానవ విముక్తిపై ఉన్న ఆశావహ దృక్పథం ఆయన రచనలకు ప్రాణవాయువును అందిస్తుంది.

చరిత్ర, జానపద సంస్కృతితో పూజారికి ఉన్న లోతైన అనుబంధం ఆయన భాషకు మట్టి వాసనను, నిబద్ధతను ప్రసాదించింది. సాధారణ ప్రజలు మాట్లాడే సరళమైన భాషలోనే అద్భుతమైన ప్రతీకలను సృష్టించారు. నాటకం, సినిమా పై తనకు ఉన్న పట్టు కూడా ఆయన కవితలు ఒక కథలా, కళ్లముందు కదిలే సన్నివేశాల్లా రూపుదిద్దుకోవడానికి కారణం. హబీబ్ తన్వీర్, శంభూ మిత్రా వంటి దిగ్గజాల రచనలను అస్సామీలోకి అనువదించారు. సినిమా విమర్శలో 'చలచిత్రార్ ఛాయ్‌పోహోర్' పుస్తకానికి గాను 2002లో జాతీయ ఫిల్మ్ అవార్డులలో 'స్వర్ణ కమలం' అందుకున్నారు.

జ్ఞాన్ పూజారి కవిత్వంలో ఉండే కళాత్మకత (AestheticBeauty) సామాజిక బాధ్యతతో సమర్థవంతంగా జతకడుతుంది. అందుకే ఆయన కవిత్వం ఏకకాలంలో హృదయానికి ఆనందాన్ని, మేధకు ఆలోచనను అందిస్తుంది. సౌందర్యం కోసం సామాజిక స్పృహను గానీ, రాజకీయం కోసం కవితాత్మకతను గానీ ఆయన ఎక్కడా త్యాగం చేయలేదు.

జ్ఞాన పూజారి తొలి కవితా సంపుటి 'దూఃసాహసోర్ సమయ్'(DuhsahosorSamay దుస్సాహస సమయం) 1983లో ప్రచురితమైంది. అస్సామీ సాహిత్యంలో ఆయనను ఒక బలమైన, సామాజిక నిబద్ధత కలిగిన కవిగా నిలబెట్టడంలో ఈ సంపుటి కీలక పాత్ర పోషించింది. 1970ల చివర, 1980ల ప్రారంభంలో అస్సాం ఎదుర్కొన్న తీవ్ర సామాజికరాజకీయ అలజడులకు ఈ కవిత్వం అద్దం పట్టింది. ప్రాంతీయ గుర్తింపు, రాజ్య అణచివేత, రాజకీయ హింస నడుమ యువతలో వ్యక్తమైన అసంతృప్తిని ఇందులో ఆవిష్కరించారు. ఇక్కడ "దుస్సాహసం" అంటే కేవలం తొందరపాటు కాదు; అణచివేతను నిలదీసే తెగింపు!

'దూఃసాహసోర్ సమయ్' లో వ్యక్తమైన విప్లవ చైతన్యమే తరువాత 2013 లో వచ్చిన 'మేఘమలార్ భ్రమణ్' లో మరింత పరిణతి చెందింది. ప్రారంభ రోజుల్లో ఉన్న ఆవేశం, తిరుగుబాటు శైలి తర్వాతి కాలంలో లోతైన మానవతావాదంతో, తత్త్వచింతనతో కూడిన సామాజిక విశ్లేషణగా రూపాంతరం చెందింది.

ఆకాశపు అనంత వీధిలో ఒంటరిగా సాగిపోయే మేఘమా!
నీ ప్రయాణం ఎక్కడి వరకు?
ఎండిపోయిన నేల దాహాన్ని తీర్చడానికా,
లేక చమట చుక్కలు చిందించే రైతు కళ్ళలో ఆశల మెరుపులు నింపడానికా?
నువ్వు సరిహద్దులు ఎరుగవు, అణచివేత సరిహద్దులను అస్సలు ఒప్పుకోవు.
కష్టాల చీకట్లను తుడిచేస్తూ వర్షమై కురిసేందుకు నువ్వు చేసే ఈ ప్రయాణమే——
మా మానవ విముక్తికి ప్రతీక!

అలాగే అస్సాం తేయాకు తోటల కార్మికుల కష్టాలను, వారి ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తూ:

ఆకుపచ్చని పచ్చికల నడుమ వంగిన నడుములు...
తెగిపడిన కలల చప్పుడు.
చిగురులు తుంచే వేళ్ళు కేవలం తేయాకును కాదు తుంచుతున్నది,
తమ నిశ్శబ్ద వేదనను కూడా!
పచ్చని కొండల వెనుక దాగున్న ఆకలి కేకలు ఎవరికీ వినిపించవు.
కానీ, ఈ మట్టికి తెలుసు
ఆ శ్రమ వెనుక ఉద్భవించబోయే ఒక పెద్ద ప్రతిఘటన తుఫాను గురించి!

'దూఃసాహసోర్ సమయ్' లోని విప్లవాత్మక ఆవేశం నుండి 'మేఘమలార్ భ్రమణ్' లోని పరిణతి చెందిన సామాజికమానవీయ ఆలోచనల వరకు ఆయన సాగించిన సాహిత్య ప్రయాణం కొత్త తరం కవులకు స్ఫూర్తిదాయకం. జ్ఞాన పూజారి సాహిత్యం కేవలం అస్సామీ ప్రాంతానికో లేదా ఒకానొక కాలానికో పరిమితమైంది కాదు. శ్రమించే మనుషుల ఆత్మగౌరవాన్ని, అణచివేతపై తిరుగుబాటును తన కవిత్వంలో నింపిన పూజారి, ఆధునిక భారతీయ సాహిత్యంలో ఎప్పటికీ స్మరణీయమైన మానవతావాది.

**వంశీకృష్ణ**
**9573427422**

# జీవిత 'శిశిరంలో నిరంకుశుడు'

గాబ్రియల్ గార్సియా మార్క్వెజ్ ప్రపంచ ఖ్యాతి గడించిన , 1982లో నోబెల్ బహుమతి పొందిన రచయిత. కథలు, నవలలు, పాత్రికేయ వ్యాసాలు ,డాక్యుమెంటరీ నవలా రచనలు చేశారు. సర్రియలిజం, మేజికల్ రియలిజం శైలిలో ఆయన రాసిన నవల 'నియంత యొక్క శిశిరం' (ది ఆటమ్ ఆఫ్ ది పాట్రియార్క్) లాటిన్ అమెరికా కు చెందిన పలు నియంతల జీవిత చరిత్రల అధ్యయనం పై ఆధారపడి రూపొందించిన అద్భుతమైన ఊహా చిత్రం. విమర్శకుడు జాన్ కింగ్ రాసినట్లు లాటిన్ అమెరికా సాహిత్యంలో అస్తిత్వ అన్వేషణ, మేజికల్ రియలిజానికి గుండె లాంటి "ఉన్నత" మరియు కింది సంస్కృతుల సమ్మేళనం, బరోక్ (అలంకార సహిత , నాటకీయ, క్రమ రహిత ) శైలిలోని భాష ఉంటుంది.

లాటిన్ అమెరికాలో దయాజ్ (మెక్సికో), కబ్రెల్ల (గ్వాటిమాలా), గోమెజ్, జెనేమేజ్ (వెనిజువేలా), ట్రుజిల్లో ( డొమినికన్ రిపబ్లిక్), సోమోజా( నికరాగువా), Batista (క్యూబా), ఇంకా ఫ్రాంకో (స్పెయిన్)లాంటి ఎందరో. ఒక్కొక్కడు ఒక మహా హంతకుడు.తర్వాత కాలంలోప్రజాస్వామ్య రిపబ్లిక్‌లు కూలి బ్రెజిల్(1964), చిలీ, ఉరుగ్వే (1973) అర్జెంటీనా (1976) లు నియంతృత్వంలో కుమిలిపోయాయి.

తన రచనల్లో 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సోలిట్యూడ్,' 'నో వన్ రైట్స్ టు ది కల్నల్,' 'లవ్ ఇన్ ది టైమ్ ఆఫ్ కలరా,' 'ది జనరల్ ఇన్ హిస్ లేబీరింత్,' 'ఇన్ ఈవిల్ అవర్,' 'క్రానికల్ ఆఫ్ ఏ డెత్ ఫోర్టోల్డ్,' 'ఐస్ ఆఫ్ ఎ బ్లూ డాగ్', 'లీఫ్ స్టార్మ్',' స్ట్రేంజ్ పిల్గ్రిమస్, 'ఆఫ్ లవ్ అండ్ ఆదర్ డిమన్స్,' 'మెమోరీస్ ఆఫ్ మెలంఖలి హోర్స్', 'న్యూస్ ఆఫ్ కిడ్నాపింగ్' మొదలగునవి ఉన్నాయి.

ప్రస్తుత నవల 'నియంత యొక్క శిశిరం' అధివాస్తవిక, కవితా శైలిలో ప్రవాహంలా సాగుతుంది. వాక్యాలు లో కామా, ఫుల్ స్టాప్ లు అరుదుగా ఉంటాయి. సంభాషణ చేస్తున్న వారెవరు అనేది తెలుసుకోదలచిన పాఠకుని గ్రహణ శక్తికి పరీక్ష. మార్క్వెజ్ నవల్లో అతడు, నేను, నీవు, జనరల్ సార్ అనే పదాలతో వాక్యాలను కలుపుతూ కథ నడుస్తుంది. కథనం మొదటి('నేను,' 'మనం'), రెండవ ( 'నీవు,' 'జనరల్ సార్,' 'నా మాత'), మూడవ వ్యక్తి ('అతడు,' 'ఆమె,' 'వారు') కథనాల్లో మారుతూ సాగుతుంది. ఫ్లాష్ బ్యాక్ పద్ధతి ఉపయోగించాడు. కవితావేశం నయాగరా జలపాతం . రచయిత ఏడేళ్లు శ్రమించి రచించిన అక్షర లావా ప్రవాహం.

పేరు లేని రాజ్యంలో(కొలంబియా కోస్టా లేక వెనిజువేలా కావచ్చు)పేరు చెప్పని సైనిక నియంత తన ఇచ్ఛ వచ్చినట్లు పాలించి, అనుమానంతో తనలాగే ఉండే వ్యక్తిని, అంగ రక్షకుని, తిరుగుబాటు దారులను, ప్రజలను సంహరింప చేసే విధానాలు, తాను మాత్రం ఈ చావును తప్పించుకుంటానని అవాస్తవిక ఊహలు చేస్తాడు.. ఏనుగు కాళ్ళ లాంటి పాదాలతో , హెర్నియతో, నిరంతర సైనిక దుస్తులు, మెడల్స్ తో తిరుగుతూ నియంత క్రూర పాలన, చిత్త కార్తి కుక్క లాంటి కాముకత్వం, ఆత్మ వంచన, నిఘా కన్నులు, హింసా కాండకు రహస్య అనుమతి , అనివార్యమైన ఏకాంత విచారం,చివరకు శిశిరం లో చెట్టులా మిగిలి ఒంటరిగా మృతి. అతని శవం రాబందుల పరం. నాటి దాకా భయ భ్రాంతులైన ప్రజలకు వసంత కాలం.

నియంత వంద నుంచి రెండు వందల ఏళ్ళ పైన పాలన ఒక ప్రతీక. చర్చి, విదేశీయుల పట్ల వ్యతిరేకత, మరలా వారికే దేశ వనరుల అప్పగింత. వారి కనుసన్నల్లో విలాస జీవనం. భవనం క్రింద ,లోపల మెట్లెక్కే ఆవులు , జంతువులు, పక్షుల పంజరాలు. తోటలో కుష్టు రోగులు అతడి సాయం కోసం. అతడికి నచ్చితే కరుణ. కోపమొస్తే వ్యతిరేకుల,తిరుగుబాటుదారుల బహిష్కారం, దారుణ మరణం. తిరగబడితే సందర్శనం.జాతి తనే. అన్ని కాలాలు, సర్వ శక్తిమంతుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు తానే. తానే దైవాంశ సంభూతుడు. తాను తాకితే జనుల రోగాలు మాయం.వంది మాగధుల పొగడ్త అతడి ఆహారం. 'చనిపోయి' బ్రతుకుతాడు. బ్రతికుంటే ఇతరుల అంతం చూస్తాడు.తన భార్య, బిడ్డల దుర్మరణానికి ప్రతీకారంగా హింసా కాండ.




అధికారం మీద నియంత, ఇతడి మీద లొంగి ఆధారపడే జనం ఆత్మ న్యూనతా భావన పరస్పరం ప్రభావితం చేసుకుంటారు. అతడు పాపి లేదా కాకిలా చిరాయువు. ఏకాకి జీవన శైలి. మృత్యు దర్శనం అనివార్యం. అపుడు అయినా అవుతుందా జ్ఞానోదయం? అయినా తిరిగి లేచేనా కూలిన స్వేచ్ఛా విగ్రహం? ఇదే చరిత్ర విషాదం. వినోదం.

నియంత పేదరికంలో జనిస్తాడు. తల్లి బెండిసివోన్ ఆల్వరాదో పెంటకుప్ప మీద గొర్రె మాంసం బాలుడి మధ్యాహ్న ఆహారం కోసం ఇచ్చి, తనువును అమ్ముకుని పెంచిన కుర్రవాడు రాజధాని వచ్చి సీసాలు అమ్ముకుంటూ సైన్యంలో చేరి జనరల్‌గా ఎదుగుతాడు. బ్రిటీష్ సాయంతో అధికారం 19 వ శతాబ్ది మధ్యలో ఫెడరలిస్ట్ యుద్ధం. అమెరికా మెరైన్స్ చేతిలో 20 వ శతాబ్ది తొలి నాళ్లలో ఓటమి. తన తొలి దశలో తన డూప్ గా పాట్రిసియో అరగోనే ను పెట్టుకుని పాలన సాగిస్తాడు. అతడు చనిపోగానే తాను పోయినట్లు ప్రచారం చేసుకుని తన మృతి పట్ల ఆనందం పొంది అధికారం కోసం సమావేశమైన వారి పని పడతాడు. తనకు రక్షగా ఉన్న రోడరిగో దె అగిలార్ తన్ను వంచించాడనే నెపంతో అతడ్ని చంపి వండి వడ్డించేలా చేస్తాడు. మానువెలా సాంచెజ్ అనే వనిత కు దాసుడై, ఆమె ఆకస్మికంగా వెళ్ళిపోతే పగతో రగిలి ఆమె ఎక్కడా దొరక్క పోతే వెర్రెక్కి పోతాడు.



ఇతాను ఉన్నా లేనట్టు , లేకున్నా ఉన్నట్లు ప్రజానీకాన నమ్మించి, వంచించి, భయ పెట్టీ వారి కోసమే తన సర్వస్వం అని సృష్టించగలదు.ఇదే మాకీయవెల్లి సైద్ధాంతిక వల. అధికారం పట్ల ప్రేమ అతడి అణువణువునా ఆవహిస్తుంది. అది నియంతృత్వ భావజాల మాయా జాలం.

నియంత జీవన శిశిరంలో తల్లి మృతి , ఆమెని సాధువుగా ప్రకటించాలని వ్యర్థ యత్నాలు, ధిక్కరించిన చర్చి వారిపై ప్రతీకార చర్యలు తీసుకుంటాడు. సన్యాసినులను నగ్నంగా పెరేడ్ చేయించి , నచ్చిన లెటిసియ నజరేనో ను అపహరించి, బలవంతంగా ఆక్రమించి , తర్వాత పెళ్లి చేసుకుని బిడ్డను కంటాడు.భార్య ఒత్తిడితో మళ్ళీ దొడ్డి దారిన మత జనుల్ని తెస్తాడు. వారికి ఎన్నో ఇహ లోక లాభాలు సమకూరుస్తాడు. ఆమె ప్రభావం పెరిగి, బజారులో నచ్చిన వస్తువులన్నీ ప్రభుత్వ ఖర్చుతో అనుభవిస్తుంటే కినిసిన వారి కుట్రతో కొడుకుతో సహా వేట కుక్కల దాడిలో అంతమైతే, నియంతలో విషాద జనిత క్రోధం జ్వలించి , ఆమె హంతకులను వేటాడే క్రమంలో ఎందరో బలవుతారు. ఈ తరుణంలో నియంత దరి చేరిన జోస్ ఇగ్నాసియో సాన్స్ దె లా బారా అనే యువకుడు అనధికారిక చిత్ర హింసల భవనంలో నియంత వ్యతిరేకుల హింసించి వారి తలలు కొబ్బరి కాయల్లా తరిగి సంచుల్లో సరఫరా చేస్తే అవి ఏమో అని తన సౌధంలో దాచి కుళ్ళు కంపుతో నిజం తెలిసినా తన బాధ్యత ఏమీ లేదని అందరూ అనుకోవాలని నియంత కోరిక. చివరకు జనం ఆగ్రహ జ్వాలల్లో జోస్ ఇగ్నాసియో సాన్స్ దె లా బారా అసువులు పోతాయి.

ఐరోపా, అమెరికా దేశాలు, వాటి దౌత్యవేత్తలు నియంత నుంచి పలు ఆర్థిక రాయితీలు, లాభాలు పొంది అతడ్ని నామ మాత్రంగా చేస్తారు. అతడి భవన సమీపంలోని కరీబియన్ సముద్రంపై హక్కులు అతడి మెడలు వంచి కాజేస్తారు. చివరి దశలో ఈ అధికార , కామినీ మహా కాముకుడు పాఠశాల బాలికలపై అత్యాచారాలు చేస్తాడు. అతని తొత్తులు, ఆశ్రితులు అంగడి బొమ్మలకు అమ్మాయిల వేషాలు వేసిన వైనం తర్వాతతెలిసి మండిపోతాడు. తన అధికార సౌధంలో అనుమానంతో, ఒంటరి ఒంటెల బ్రతుకుతూ, తన కీర్తి తనే టాయిలెట్ గోడలపై రాసుకుంటూ, పునర్ యవ్వన వాంఛతో తపిస్తూ, ఏకాంతంలో దయనీయంగా ,అనివార్యంగా చనిపోతే ఆ వార్త విని నమ్మక , నమ్మలేక చివరకు నమ్మిన జన సందోహ ఆనందోత్సవాలతో నవల ముగుస్తుంది.

గెరాల్డ్ మార్టిన్ అనే విమర్శకుడు "ఇది అధికారం, కీర్తి, ఏకాంతం పైన లోతైన ఆలోచన " అని, మార్క్వెజ్ దృక్పథం "నిర్దాక్షిణ్య వాస్తవికత కానీ నిరాశ కాదు" అని రాశాడు. మరో నోబుల్ బహుమతి గ్రహీత ఆస్టూరియాస్ నవల 'ది ప్రెసిడెంట్' లో నియంత అధికారాలు కేంద్రీకృతం చేసుకునీ సాలెగూడులో పెద్ద సాలెపురుగు లా దూరం నుంచి అదుపు చేస్తున్నట్లు చూపిస్తే మార్క్వెజ్ నవల నియంత చేతన, ముఖ్య ఉద్దేశాలను ఎక్కువగా పట్టించుకుంటుంది అని మార్టిన్ అభిప్రాయం. మార్టిన్ భావనలో మార్క్వెజ్ నవల 'నూరేళ్ళ ఒంటరితనం' అతని జీవితానికి సాహితీ కేంద్రమైతే, 'నియంత యొక్క శిశిరం' నవల అతని సాహిత్యానికి కేంద్రం, ఇంకా మేలుగా ఇరుసుగా చెప్పవచ్చు.

రెండు నవలల్లో కవితా శైలి ఉన్నా ఆస్టూరియాస్ నవల అందమైన కట్టడం లాగా ఆకర్షిస్తే, మార్క్వెజ్ శైలి ప్రవాహంలా కొనిపోతుంటుంది. ఈ నవలకు స్థల, కాలాలను దాటిన నిరంకుశ రాజ్యాలకు సంబంధించిన విశ్వ జనీనత ఉంది. కాకుంటే ఆధునిక నియంతల సాంకేతిక జ్ఞానం, వ్యవస్థల స్వాధీనం, జాతి ద్వేష భాష, అనుకూల మీడియా ప్రచార హోరుకు , మార్క్వెజ్ రచనా కాలం నాటి స్థితికి నియంతృత్వ స్థాయిలో మాత్రమే తేడా కానీ స్వభావంలో కాదు.

**–డా. జె. రవీంద్రనాథ్**
**విశ్రాంత ఆంగ్ల ఆచార్యులు**
**8978131585**

## సెప్టెంబర్ 5న పుస్తకావిష్కరణ సభ

తాటికొండాల నరసింహారావు సాహిత్య వ్యాసాల సంపుటి ఆవర్తనం ఆవిష్కరణ సభ 5 సెప్టెంబర్ 2026 సాయంత్రం ఆరు గంటలకు రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో జరుగుతుంది. తెలంగాణ సాహిత్య అకాడమీ వారి సాహిత్య వారంలో భాగంగా జరిగే ఈ సభలో పుస్తకాన్ని డా. కె.వి. రమణాచారి ఆవిష్కరిస్తారు. సభకు సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అధ్యక్షత వహిస్తారు. సభలో డా. ఏనుగు నరసింహారెడ్డి, డా. కొండపల్లి నీహారిణి, కె. ఆనందాచారి, సమ్మెట విజయ, వంశీకృష్ణ, నీలిమ వి.ఎస్.రావు ప్రసంగిస్తారు.

**నామోజు బాలాచారి**
**కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ**

గుడిపాటి
పాలపిట్ట

## అనిశ్చితి

మూడంటే..
మూడే వాక్యాలను పేని
ప్రపంచ శిఖరాన్ని అధిరోహించి
నీ ఆలోచనల చివరి అంచున దాక్కుండి
రెండు ఘర్షణలకు సొమ్మసిల్లి
ఇంకొక రూపంలోకి మారుతుంది. అది కూడా
నిలకడగా ఉండదు.

స్వేదపు చినుకు నేలను తాకుతుండగా
కొలిమిలో ఎర్రగా కాలిన కాలం
గుండెను ద్విపార్శ్య ధ్రువాలుగా
ఆవిష్కరిస్తోంది. కొద్ది ఘడియలు

అంతా భ్రమ విభ్రమాల దృశ్యం

ఏదీ నిశ్చయం కానిచోట
ఎటూ తేలని విలయపు ఉచ్చు
మనసును
ఉక్కిరి బిక్కిరి చేసే త్రిశంకు స్వర్గం

ఎంతో సమయం దేహం అలా...
ఊగిసలాడక పోవచ్చు

నేలమాళిగలోకి దూరిన పిపీలికం
వెలుగు దారుల్ని కలగన్నట్టు
ఓ అలవికాని సందిగ్ధ స్థితిలో
ప్రతీ ఒక్క జీవి...మనుషులు ఎక్కువగా..

కారుణ్యం
మరణపు అంచును హత్తుకుంటుంది
సజీవ సమాధులను
ఏ లేఖినీ పెళ్లగించని హృదయ సంకెల

చావుకూ.... బ్రతుక్కూ...మధ్య
కొన్ని అనాఘ్రాత పుష్పాలు
పూర్తిగా వికసించవూ...వాడిపోవూ..
అనిశ్చితి.!....ఎల్లప్పుడూ......



**డా. కటుకోఝ్వల రమేష్**
**,సెల్:9949083327**

## "నా రేడియో సినీ జ్ఞాపకాలు" సెప్టెంబర్ 3న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ లో ఆవిష్కరణ

పాత తరం తెలుగు సినీ అభిమానులకు ఒక అపురూపమైన జ్ఞాపకంగా రూపొందిన "నా రేడియో సినీ జ్ఞాపకాలు" పుస్తకం సెప్టెంబర్ 3న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ లో ఆవిష్కరణ జరుగనుంది. ప్రముఖ వైద్యులు డాక్టర్ వుడుత చంద్రశేఖర్ రచించిన ఈ పుస్తకాన్ని ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ దారం రఘురామన్ ఆవిష్కరించనుండగా, డాక్టర్ మేకా విజయమోహన్ రెడ్డి అతిథిగా హాజరవుతారు. ప్రముఖ కవి సినీ విమర్శకుడు వారాల ఆనంద్, గంద్ర లక్ష్మణరావు, మాడిశెట్టి గోపాల్, స్వామీ పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారు. ఈ పుస్తకంలో అలనాటి ఆపాత రేడియో కార్యక్రమాల తీపి జ్ఞాపకాలు, అప్పటి సినీకవుల సాహిత్యపు భావ వీచికలు,మదిని దోచుకునే అప్పటి కొన్ని అరుదైన సినిమా పోస్టర్లు,సినీ గాయనీ గాయకుల,మధుర స్మృతులు,చెప్పుకోదగ్గ ప్రతిభ ఉండీ రావలసినంత గుర్తింపు రాలేకపోయిన కొంతమంది సినీ కళాకారుల గాథలు,అభిరుచి గల సినీ నిర్మాతల కళాత్మక విశేషాలు, అరుదైన తెలుగు సినిమా ప్రాభవాన్ని ఏర్చి , కూర్చి రాసిన ఆపాత స్మృతులు ఉన్నాయి. సాహితీ సినీ అభిమానులు హాజరుకావలసింది గా కోరుతున్నాం.

**కే.ఎస్. అనంతాచార్య**
**కార్యదర్శి, సమైఖ్య సాహితీ, కరీంనగర్**



# మానసిక ప్రశాంతత కోసం..

**ఆదిలాబాద్ మహా :** ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత, ఆత్మసంతృప్తి లభిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌పేటలో గల శ్రీకృష్ణ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన సుందర చైతన్యానంద స్వామి సత్సంగ్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మికతకు కేటాయించాలని సూచించారు. భగవంతుని స్మరణ, సత్సంగం, భజనలు మనసుకు ప్రశాంతతను అందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం శ్రీకృష్ణుడికి సంబంధించిన భక్తిగీతాన్ని ఆలపిస్తూ భక్తులతో కలిసి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్సంగ్ ప్రతినిధులు, వార్డు కౌన్సిలర్ బండారి పోశన్న, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# దూదేకుల సంఘానికి అండగా ఉంటా

- వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- జిల్లా సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి భరోసా

**ఆదిలాబాద్ మహా** : తెలంగాణ దూదేకుల నూర్ భాషా సంఘ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన తెలంగాణ దూదేకుల నూర్ భాషా సంఘ జేఏసీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. దూదేకులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగాలన్నారు.వారికి ఎల్లప్పుడు అండగా ఉంటానని ఏ అవసరమొచ్చినా సహాయ సహకారమందించేందకు సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. దూదేకుల నూర్ భాషా కార్పోరేషన్ ఏర్పాటు కోసం జిల్లా కేంద్రంలో వారి సంఘ భవనం కోసం వారి వినతిని ప్రభుత్వ పెద్దలకు తెలియచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ డీసీసీడీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ ఆలీ,దూదేకుల జేఏసీ చైర్మన్ షేక్ బడే సాహెబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ షుకురుద్దీన్, వైస్ చైర్మన్లు వాహిద్ ఖాన్, షేక్ రఫీక్,జిల్లా అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ సంఘ సభ్యులు దూదేకుల కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి అధికారులు హాజరు కావాలి:కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని సూచించారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని పేర్కొన్నారు.సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలంసబ్ కలెక్టర్ కార్యాలయంలో కొత్తగూడెం ఆర్డీవోకార్యాలయంలో జిల్లాలోని అన్నీ మండల పరిషత్ కార్యాలయాలలో ప్రజావాణి నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



# ఘనంగా పండగ సాయన్న విగ్రహావిష్కణ

ఆదిలాబాద్ మహా : పట్టణంలో భీమన్న దేవుడు, పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ముదిరాజ్ ల ఆరాధ్య దైవం పండగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ అన్నారు ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ తమ కుల, మత సంప్రదాయాలకు అనుగుణంగా తమ ఆరాధ్య దైవాలను పూజించుకోవడం, తమ సమాజ పెద్దలను గౌరవించుకోవడం మంచి పరిణామమని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత, పరస్పర గౌరవాన్ని మరింత పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ముదిరాజ్ కులస్తులందరికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు దారవేణి రాము, ప్రధాన కార్యదర్శి దార్న రవి, కోశాధికారి సంతోష్, గౌరవ అధ్యక్షుడు పులి నగేష్, ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, రాజు, శివయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇండ్లు



**ఆదిలాబాద్ మహా :** అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత గూడు కల్పించి, వారి జీవితాల్లో భరోసా నింపడమే ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం తాంసి మండలం పొన్నారి గ్రామంలో లబ్ధిదారులు లక్ష్మి-రామన్న దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ గృహప్రవేశ వేడుకకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దంపతులతో కలిసి నూతన గృహంలోకి ప్రవేశించిన కలెక్టర్, వారికి శాలువా కప్పి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 400 చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన ఇంటిని, నిర్మాణ నాణ్యత, గదులు, మౌలిక వసతులను పరిశీలించారు. నిరుపేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతీకగా నిలుస్తోందన్నారు. గృహ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని అధికారులను ఆదేశించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించి, లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకునేలా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. లక్ష్మి కుటుంబానికి ఇప్పటికే మూడు విడతల బిల్లులు జమయ్యాయని, ఇంటి నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో చివరి విడత బిల్లును త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు నిధులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలెక్టర్ ముచ్చటించారు. పిల్లల చదువులు, కుటుంబ సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ స్వయంగా తమ ఇంటికి వచ్చి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించడంపై లబ్ధిదారులు లక్ష్మి-రామన్న దంపతులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ నారాయణ, స్థానిక సర్పంచ్ తలారి భూమన్న, ఉపసర్పంచ్ రాంరెడ్డి, హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ జాదవ్ గణేష్, ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, ఇంజనీరింగ్, రెవెన్యూ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జగన్‌పై విజయసాయి ఆరోపణలు దురదృష్టకరం

**అమరావతి:** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న ఆరోపణలు దురదృష్టకరమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రచారం కోసమే సాయిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వ చర్యలను జగన్‌కు ఆపాదించడం సరికాదన్నారు. దాదాపు 40 ఏళ్లుగా జగన్‌తో కలిసి పనిచేసిన విజయసాయిరెడ్డి ఇప్పుడు వ్యక్తిగత ఆరోపణలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. మతమార్పిడులను జగన్ ప్రోత్సహించారన్న ఆరోపణలను సజ్జల తీవ్రంగా ఖండించారు. పార్టీని వీడిన నేతలపై జగన్ ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలు చేయలేదని, ప్రజా సమస్యలపై పోరాటమే వైసీపీ లక్ష్యమని స్పష్టం చేశారు.



# త్రాగునీటి కోసం రాస్తారోకో

**దమ్మపేట ,మహా :** మండల పరిధిలోని మొద్దులగూడెం హరిజనవాడకు చెందిన ప్రజలు మంచినీటి కోసం ప్రదాన రహదారిపై ఖాళీ బిందెలతో మహిళలు, పురుషులు పెద్ద ఎత్తున ఆదివారం రాస్తారోకో చేశారు. సంఘీభావం గా సిపిఎం పార్టీ దమ్మపేట మండల కార్యదర్శి మోరంపూడిశ్రీనివాసరావు, మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మినారాయణ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొద్దులగూడెంలో దళిత వాడలోని గ్రామపంచాయతీ మోటారు చెడిపోయి 30 రోజులు కావస్తుందని, రోజూ కూలి మీద జీవితం గడిపే 200 కుటుంబాలకు మంచి నీళ్ళు రావటం లేదని, యుద్ధ ప్రాతిపదికన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి క్రొత్తగా బోరు వేయించి, కొత్త కరెంట్ మోటార్ బిగించి మంచినీరు అందించాలని కోరారు. దళిత వాడలో మంచినీటికి పరిష్కారం చూపని యెడల మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కాలనీప్రజలు ఎం సీతయ్య, ఎం .మల్లేశ్వర రావు, కె. రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసి యువతి శిరీష మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి

- ఆదివాసి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- అనుమానాస్పద మృతిపై లోతైన దర్యాప్తు చేయాలి .
- మాజీ ఎమ్మెల్యే తాటి

**దమ్మపేట ,మహా :** ఆదివాసి యువతి శిరీషపై మానవమృగం చేసిన దాడిని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరాలను వెల్లడించారు. ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి యువతి శిరీష హైదరాబాద్ తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శిరీష మృతిపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేకుండా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఘటనకు ముందు, తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలించి, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని కోరారు. మృతికి అసలు కారణం ఏమిటన్నది స్పష్టంగా తేల్చి, దర్యాప్తులో బాధ్యులుగా గుర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యోగం కోసం స్వగ్రామానికి దూరంగా వెళ్లిన ఆదివాసి యువతి అనుమానాస్పదంగా మృతి చెందడం ఆందోళన కలిగించే విషయమన్నారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారి భద్రతకు అవసరమైన రక్షణ చర్యలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు.శిరీష కుటుంబం ప్రస్తుతం తీవ్ర విషాదంలో ఉందని, వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులకు తగిన న్యాయం, సహాయం అందేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తాటి వెంకటేశ్వర్లు కోరారు. శిరీష మృతికి సంబంధించిన ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.



# సేవకు చిరునామా మెరుగు నరసయ్య కుటుంబం

- ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్
- పలు కుటుంబాలకు మద్దెల బృందం పరామర్శ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సేవకు చిరునామాగా.. మెరుగు నరసయ్య కుటుంబం నిలిచిందని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఆదివారం మధుర బస్తి ఏరియాలో అనారోగ్యంతో మృతి చెందిన మెరుగు నర్సయ్య పార్థివ దేహానికి పూలమాలలతో నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ మెరుగు నరసయ్య తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. నరసయ్యతో పాటుగా తాను కూడా పార్టీలో వివిధ రకాల సేవలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషాతో పాటు మద్దెల శివకుమార్ బృందం పాల్గొంది. ఇదిలా ఉండగా సాక్షి దినపత్రిక రిపోర్టర్ శేఖర్ మాతృమూర్తి వాసాల పోశమ్మ ఇటీవల మృతి చెందింది. ఆదివారం జరిగిన ఆమె దశదినకర్మకు మద్దెల శివకుమార్ బృందం పాల్గొంది. అదేవిధంగా నిమ్మలగూడెంలో జరిగిన దివంగత ఉప్పెర్ల స్వామి దశదినకర్మకు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన బృందంతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తోపాటుసంఘ నాయకులు టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, జిల్లా అధ్యక్షులు మచ్చా పృథ్వీరాజ్, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేశ్వరరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# గంటల వ్యవధిలోనే సమస్యపరిష్కరించిన ఎమ్మెల్యే జారె

- ఉదయం రాస్తారోకో - సాయంత్రం పరిష్కారం.
- హర్షం వ్యక్తం చేసిన బాదితులు

**దమ్మపేట ,మహా :** మండల పరిదిలో ని మొద్దులగూడెం లో దళిత వాడలో గత 30రోజులుగా త్రాగునీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అశ్వారావుపేట శాసన సభ్యులు జారె ఆదినారాయణ దృష్టికి వచ్చిన గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించారు. వెంటనే అక్కడి గ్రామశాఖ అద్యక్షుడితో చర్చించి సమస్య యొక్క తీవ్రతను పరిశీలించి , బోరు వేయించారు. ఆ ప్రాంత ప్రజలకు త్రాగునీటి కష్టలను కడతేర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫోన్ లో మాట్లాడుతూ ప్రజా సమస్యలు తన దృష్టికి వస్తే వెంటనే పరిష్కారం ఉంటుందని ,ప్రజా సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అంతకు ముందు దాదాపుగా 5గంటల ముందు సిపిఎం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. వెంటనే సమస్య పరిష్కారం కావడం పట్ల ఎమ్మెల్యే కు ,సిపిఎం పార్టీ నాయకుల కు బాదితులు ధన్యవాదాలు తెలిపారు.

# క్యాన్సర్ బాధితుడు సంతోష్‌కు.. నైనిష ఫౌండేషన్ చేయూత

- వైద్య ఖర్చులకు రూ.3 వేల ఆర్థిక సాయం
- నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని ప్రతినిధుల భరోసా



**మణుగూరు, మహా :** క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ, చికిత్స ఖర్చులు భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ నిరుపేద కుటుంబానికి నైనిష ఫౌండేషన్ మానవీయ హృదయంతో చేయూతనందించింది. మణుగూరు మండలం శేషగిరినగర్‌కు చెందిన బాసిక సంతోష్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో వైద్య ఖర్చులు కుటుంబానికి భారంగా మారాయి. సంతోష్ పరిస్థితిని తెలుసుకున్న నైనిష ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించారు. ఆయన వైద్య చికిత్స ఖర్చులకు తమవంతు సహకారంగా రూ.3 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అందించే చిన్న సహాయం కూడా బాధిత కుటుంబానికి ఎంతో భరోసానిస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు భవిష్యత్తులోనూ నైనిష ఫౌండేషన్ అండగా నిలుస్తుందని తెలిపారు. సంతోష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నైనిష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్టులు పోదిల వీరబాబు, మిట్టపల్లి గోపి, అడ్వకేట్ ఈర్ల రాము, ఉప్పాడి అనితతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రకృతి ఆరాధనకు తీజ్ పండుగ నిదర్శనం.!

- ఇంజాపూర్‌లో తీజ్ వేడుకల్లో పాల్గొన్న మల్‌రెడ్డి రంగారెడ్డి..
- మొలకల బుట్టను నెత్తినబెట్టుకుని మహిళలతో కలిసి సందడి
- నేటితరం యువత వాటిని కాపాడాల్సిన అవసరం ఉంది: ఎమ్మెల్యే..

**ఆదిభట్ల సర్కిల్ ఆగస్టు 30 మహా**: బంజారాల సంస్కృతికి, ప్రకృతి ఆరాధనకు తీజ్ పండుగ నిలువెత్తు నిదర్శనమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని ఇంజాపూర్‌లో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఆయనకు... సాంప్రదాయ దుస్తులు ధరించిన బంజారా మహిళలు, యువతులు ఘనస్వాగతం పలికారు. గిరిజన సోదరీమణుల కోరిక మేరకు మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా బంజారా సంస్కృతిని గౌరవిస్తూ, గోధుమ మొలకలు ఉన్న వెదురు బుట్టను తన నెత్తిన పెట్టుకుని, సందడి చేశారు. బంజారా సాంప్రదాయ డప్పు చప్పుళ్లు, తీజ్ పాటల మధ్య మహిళలతో కలిసి ఆయన అడుగులు వేస్తూ అందరిలో ఉత్సాహం నింపారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, నేటితరం యువత వాటిని కాపాడాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఇంజాపూర్‌లో బంజారాల కోసం నిర్మించతలపెట్టిన భావన నిర్మాణానికి తన సహకారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, బంజారా మహిళలు, యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.





# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- బాకారం సర్పంచ్ వెంకటేష్ గౌడ్

**మొయినాబాద్ మహా:** గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని బాకారం గ్రామ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ తెలిపారు. మొయినాబాద్ మండలం బాకారం గ్రామం పంచాయతీ ఆవరణలో ఆదివారం లిమ్స్ న్యూరో కార్డియో ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలు తమకు జబ్బులు వస్తే కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి ఉంటుందని, అలాంటిది కార్పోరేట్ ఆసుపత్రి వారే స్వయంగా గ్రామీణ ప్రాంతాలకు వచ్చి వైద్యం చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉచిత వైద్య పరీక్షలు ఉచిత రక్త పరీక్షలు అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. రోగులకు న్యూరాలజీ కార్డియాలజీ ఆర్థోపెడిక్, ప్రసూతి సేవలు, యూరాలజీ, చర్మవ్యాధి కంటి వ్యాధి తదితర వ్యాధులకు తమ ఆసుపత్రిలో చికిత్స అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయభాస్కర్ గౌడ్, మాజీ సర్పంచ్ సుధాకర్ యాదవ్ గ్రామ ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, ఉమారాణి బిక్షపతి గౌడ్, కొండకళ్ళ అమృతఎల్లయ్య, మరియు బిక్షపతి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, వడ్ల మీనాక్షి, ఆశావర్కర్లు వడ్ల స్వప్న, అనిత, నిర్మల మరియు గ్రామస్థుల తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లమ్మ తల్లి దీవెనలు జవహర్ నగర్ ప్రజలపై ఉండాలి

- పండుగలు ఐకమత్యానికి హేతువులు
- జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య

**జవహర్ నగర్, మహా** : ఎల్లమ్మ తల్లి దీవెనలు జవహర్ నగర్ ప్రజలందరిపై ఉండాలని, పండుగలు ఐక్యమత్యానికి హేతువులని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య పేర్కొన్నారు. జవహర్ నగర్ పాపయ్య నగర్ లో శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం, బోనాల పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య హాజరై అమ్మవార్లకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ, ఎల్లమ్మ తల్లి దీవెనలు జవహర్ నగర్ ప్రజలపై ఉండి అమ్మవారి కరుణాకటాక్షాలతో జవహర్ నగరే కాక తెలంగాణ యావత్తు పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని ఆ అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. తెలంగాణలో అతిపెద్ద పండుగ బోనాల పండగేనని ఈ పండుగ ఐక్యమత్యానికి చిహ్నాలు అన్నారు. అనంతరం రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవంలో పాల్గొని అమ్మవారి కరుణాకటాక్షానికి పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు మేకల భార్గవ రామ్, పాపయ్య నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# 624 సర్వే నెంబర్ అని తేల్చిన ఏడీ సర్వే!

- అయితే 527 గా మార్చింది ఎవరు?
- పాత రికార్డు ను పక్కన పెట్టిన డిప్యూటీ కమిషనర్
- సర్వే నివేదికల పై భేదాభిప్రాయాలు ఎలా?



**వరంగల్, బ్యూరో మహా ;** గత గ్రీవెన్స్ లో వరంగల్ నగరంలోని ఒకే స్థలానికి సంబంధించిన సర్వే నంబర్ విషయంలో జీడబ్ల్యూఎంసీ అధికారుల నిర్ణయాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. 624/1/2 సర్వే నంబర్ సరైనదని గతంలో పరిశీలించిన అధికారులు తేల్చగా.. ఇటీవల అదే స్థలాన్ని 527/బిగా పేర్కొంటూ చర్యలు తీసుకోవడంపై బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ నెల 14న ఏడీ సర్వే ఇచ్చిన నివేదిక లోనూ స్థలం 624/1/2కు సంబంధించినదిగా తేల్చినట్లు వారు చెబుతున్నారు. మరి 527/బి సర్వే నంబర్ ఎలా తెరపైకి ఎలా వచ్చింది? దాన్ని మార్చింది ఎవరు? ఏ రికార్డుల ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అంతేకాకుండాఇదే వివాదం 2021 సంవత్సరంలోనూ తలెత్తినట్లు బాధితులు చెప్పుకొచ్చారు. గతంలో జీడబ్ల్యూఎంసీ లో డీసీ గా పనిచేసిన ఈసంపెల్లి జోనా ఇరువర్గాల పత్రాలను పరిశీలించి 624/1/2 సరైన సర్వే నెంబర్ గా, 527/బి ని తప్పుడు సర్వే నెంబర్ గా గుర్తించినట్టు వారు పేర్కొంటున్నారు. 527/బి ఆధారంగా జారీ చేసిన ఇంటి నెంబర్ ను కూడా అప్పుడే రద్దు చేసినట్లు కూడా వారు చెబుతున్నారు. కాగా తాజాగా అదే వ్యవహారం మళ్లీ తెరపైకి రావడం వెనుక కారణమేంటన్నది మరలా ప్రశ్నగా మారింది. పాత విచారణలో పరిశీలించిన పత్రాలు, అప్పటి నిర్ణయం, ఇంటి నంబర్ రద్దు ఉత్తర్వులు, తాజాగా తీసుకున్న నిర్ణయానికి ఆధారమైన రికార్డులను బయటపెడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని బాధితులు అంటున్నారు.ఓ వైపు ఏడీ సర్వే నివేదిక 624/1/2ను సూచిస్తోంది. మరోవైపు డీసీ ప్రసన్నరాణి పేరుతో జారీ అయిన నోటీసుల్లో 527/బి ఆధారంగా హక్కులు గా నిర్ణయించడం పై బాధితులు ప్రశ్నిస్తున్నారు. సర్వే నంబర్ మార్పునకు సంబంధించిన రికార్డు ఏది? మార్పు ఎప్పుడు జరిగింది? ఎవరి ఆదేశాలతో జరిగిందని? సంబంధిత ఫైల్లో ఎవరి సంతకాలు ఉన్నాయి? అన్న అంశాల పై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని వారు కోరుతున్నారు. ముఖ్యంగా సర్వే రికార్డులు, పాత ఇంటి నంబర్ల ఫైళ్లు, మ్యూటేషన్ పత్రాలు, నిర్మాణ అనుమతులు, ఏడి సర్వే నివేదికలను పరస్పరం సరి చూడాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.

**కోర్టుకు వెళ్లండన్న డీసీ తీరుపై విమర్శలు**

బాధితుల వద్ద ఉన్న పత్రాలు, సర్వే నివేదికలు సమర్పించినప్పటికీ సమస్యను పరిష్కరించకుండా కోర్టుకు వెళ్లాలని సూచించడం పై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడి సర్వే తో పాటు సరైన నివేదికలు ఉన్నప్పుడు అధికారులు నిర్ధారించాల్సిన బాధ్యత ఉండగా కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఏముందని వారు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ రెండు వర్గాల మధ్య స్థల వివాదం ఉంటే.. బల్దియా రికార్డుల్లో సర్వే నంబర్లు, ఇంటి నంబర్లకు సంబంధించిన నిర్ణయాలు ఏ నివేదికల ఆధారంగా తీసుకున్నారో ముందుగా స్పష్టం చేయాల్సిన బాధ్యత అధికారుల పై ఖచ్చితంగా ఉందని అంటు న్నారు. అసలు ఏడి సర్వే కన్నా మించిన సర్వే ఏముంటుందని ఇప్పటికే ఒకసారి 624/1/2 సరైనదని తేల్చిన నేపథ్యంలో మళ్లీ అదే స్థలాన్ని 527/బి గా పేర్కొనడం పై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అక్రమ ఆక్రమణలకు అధికారులు సహ కరిస్తున్నారా?***

గత కొంతకాలంగా డీసీ ప్రసన్నరాణి తీరు పై ఇటు ఉద్యోగులు, అటు సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కార్యాలయ ఉద్యోగుల గ్రూపులో తనను ఎదిరించే ఉద్యోగులను ఏసీబీ ట్రాప్ చేయిస్తానని మెసేజ్ పెట్టి బెదిరింపులకు పాల్పడ్డారని ఆమెకు కొందరు మీడియా రిపోర్టర్ల సపోర్టు తోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని కార్యాలయంలో బహిరంగంగా చెప్పుకుంటున్నారు.అంతేకాకుండా సదరు డిప్యూటీ కమిషనర్ పై కొంతమంది బాధితులు తీవ్ర అవినీతి ఆరోపణలు చేస్తు న్నారు. నగరంలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలకు కూడా అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు తరచూ వస్తున్న నేపథ్యంలో ఈ అంశంలోనూ అదే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెబుతున్నారు. అయితే అవినీతి లేదా కబ్జాలకు అధికారుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు రికార్డుల ఆధారం గా నిర్ధారించాల్సిన అవసరం ఉందని 624/1/2, 527 / బి సర్వే నంబర్లకు సంబంధించిన పూర్తి రికార్డులను స్వతంత్రంగా పరిశీలించాలని బాధితుడు కోరుతున్నాడు.



# నీట్‌పీజీ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన రామగుండం సీపీ

**పెద్దపల్లి, మహా ;** పెద్దపల్లి పట్టణంలో ఆదివారం నిర్వహించిన నీట్‌పీజి 2026 పరీక్షల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ తో కలిసి బందారికుంట సమీపంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య, భద్రతా చర్యల పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా తరలించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పెద్దపల్లి జోన్ పరిధిలో మూడు పరీక్షా కేంద్రాల్లో నీట్‌పీజీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. పెద్దకల్వలలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నిర్వహణతో పాటు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు పూర్తయిన అనంతరం ప్రశ్నపత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.ప్రస్తుతం అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పోలీస్ కమిషనర్ కోరారు.



# నీట్ పీజీ–2026 పరీక్ష విజయవంతం

**నర్సంపేట, మహా ;** వరంగల్ జిల్లా నర్సంపేటలోని బిట్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ-2026 పరీక్షను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు.ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట డియార్వో విజయలక్ష్మి , నర్సంపేట ఆర్డీవో ఉమారాణి సెక్షన్ సూపర్డెంట్ రంజిత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ-2026 పరీక్షకు మొత్తం 132 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 127 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



# నేడు సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

--మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని మెడికల్ గోడౌన్‌లో నిర్మించిన అధునాతన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను నేడు ఉదయం 10 గంటలకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక తెలిపారు. జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 42 వేల 450 మంది విద్యార్థులకు, 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న 6 వేల 654 మంది విద్యార్థులకు ప్రతి రోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం కొరకు ఏర్పాటు చేశామన్నారు. రోజుకు 50 వేల మందికి ఆహారం అందించగల సామర్థ్యంతో ఈ కిచెన్‌ను రూపొందించారని, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరిస్తుండగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా కిచెన్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం కేటాయించిన సుమారు 8 వేల చదరపు అడుగుల షెడ్‌లో ఈ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం జరిగిందని, ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను అత్యున్నత స్థాయిలో నిర్వహించేందుకు ఫుడ్ ల్యాబ్, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, ఆర్.ఓ. వాటర్ ప్లాంట్, బాయిలర్ ప్లాంట్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, ఆటోమేటిక్ వెజిటబుల్ వాషింగ్ అండ్ కటింగ్ యూనిట్ వంటి ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కిచెన్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ స్టీమర్లతో గంటకు 5 వేల 600 ఇడ్లీలు, ఆటోమేటిక్ దోశ మెషీన్‌తో గంటకు 2 వేల దోశలు, ఆటోమేటిక్ పూరీ మెషీన్‌తో గంటకు 3 వేల 600 పూరీలు, సాంబార్, కూరల తయారీ యూనిట్ల ద్వారా 2 గంటల్లో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా ఆహారం, రైస్ కుకింగ్ పరికరాల ద్వారా కేవలం 40 నిమిషాలలో 1 వేయి మందికి సరిపడా అన్నం తయారు చేసే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచనల మేరకు వారపు మెనూను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం, మందమర్రి, లక్సెట్టిపేట, దండేపల్లి, కాజీపేట, నెన్నాల్, హాజీపూర్, నాస్పూర్, భీమారం మండలాలు, జగిత్యాల జిల్లాలోని వెల్లటూరు, ఎండపల్లి మండలాలు, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్లకుండా ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా విద్యను అభ్యసించేలా చేయడం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణంలో, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, ఏకాగ్రత, విద్యాభ్యాసంపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు.



# సజావుగా సాగిన నీటి ప్రవేశ పరీక్ష.!

**మద్యం సేవించి పరీక్షకు హాజరైన అభ్యర్థి అభ్యర్థిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 30 మహా:** శేరిగూడలో ఐఓఎన్ కేంద్రంలో పోలీస్ బందోబస్తు నడుమ నీట్ పీజీ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష, టాటా ఐఓఎన్ డిజిటల్ కేంద్రంలో పోలీస్ బందోబస్తు నడుమ సజావుగా నిర్వహించారు. పరీక్ష సజావుగా సాగుతున్న వేళ హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్ అనే అభ్యర్థి, మద్యం సేవించిన నీట్ పీజీ పరీక్ష రాసేందుకు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించిన అనంతరం అభ్యర్థి మద్యం సేవించిన హాల్లోకి వచ్చినట్లు ఇన్విజిలేటర్ గుర్తించారు. అతని తీరును గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై పరీక్ష రాయడానికి అనుమతించలేదు. పరీక్ష హాల్ నుంచి బయటకు పంపించారు. నీట్ పీజీ వంటి కీలకమైన ప్రవేశ పరీక్షకు మద్యం సేవించి రావడంతో పరీక్ష కేంద్రం వద్ద కొంతసేపు కలకలం నెలకొంది. పరీక్షా నిబంధనల ప్రకారం అభ్యర్థిని పరీక్షకు దూరంగా ఉంచారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.



# గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా తాడూరి గగన్ కుమార్

**కుషాయిగూడ, మహా :** ఏ.ఎస్.రావు నగర్: 2026 గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం డా. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా జమ్మిగడ్డకు చెందిన తాడూరి గగన్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం డా. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ గణేష్ ఉత్సవ సమితి పెద్దల ఆధ్వర్యంలో పలువురు అభ్యర్థుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి ఏకాభిప్రాయంతో గగన్ కుమార్‌ను 2026 సంవత్సరానికి డివిజన్ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. మాజీ ఫౌండర్లు పుల్లారెడ్డి, కె. రమేష్ యాదవ్, మర్రి మోహన్ రెడ్డి, వెంకట హరి గుప్తా, మల్కా రమాదేవి, బొజ్జ రాఘవరెడ్డి తదితరులు నూతన కన్వీనర్‌కు ఆశీస్సులు అందించారు. మాజీ కన్వీనర్లు కిషోర్ చారి, నిరుకొండ సతీష్ బాబు, రామసామి ప్రభాకర్ రెడ్డి, తేలు నాగరాజు, పృథ్వి, కాసం మహిపాల్ రెడ్డి, నితిన్ తదితరుల సహకారంతో ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగింది. కుమారస్వామి, ఉమేష్ చారి, ఆదినారాయణ చౌదరి, పాత కోటి



రామలింగం, సింగం కిరణ్, సత్యనారాయణ గౌడ్, పెద్ది నవీన్ గుప్తా, మురళి, సతీష్ తదితరుల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ గగన్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పెద్దలు, మాజీ కన్వీనర్లు, సమితి సభ్యులు, మిత్రబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. డా. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్‌లో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో ఘనంగా నిర్వహించేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం

- **ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల్లో నిర్మాణానికి సీఎం మెగా ప్లాన్**
- **డిసెంబరులో శంకుస్థాపనకు అవకాశం**
- **బీసీసీఐతో భాగస్వామ్యంపై కసరత్తు.**




**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ క్రీడా రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచస్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. స్టేడియానికి అనువైన స్థలాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది డిసెంబరులో శంకుస్థాపన చేసే అవకాశం ఉందని తాజా నివేదికలు చెబుతున్నాయి. అయితే శంకుస్థాపన తేదీ, తుది స్థలం, నిర్మాణ సంస్థ, వ్యయం వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రతిపాదిత స్టేడియానికి 1.32 లక్షలకు పైగా ప్రేక్షకుల సామర్థ్యం ఉండేలా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదే కార్యరూపం దాల్చితే అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం రికార్డును అధిగమించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బీసీసీఐ అధికారిక వివరాల ప్రకారం నరేంద్ర మోదీ స్టేడియం 1,32,000 మంది ప్రేక్షకుల సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ వేదికగా ఉంది. హైదరాబాద్‌లో ప్రతిపాదిస్తున్న స్టేడియం మాత్రం ఇంకా ప్రణాళిక దశలోనే ఉందని, సీటింగ్ సామర్థ్యం తుది రూపకల్పనలో మారే అవకాశం ఉందని గమనించాలి.

**100 ఎకరాల్లో.. బహుళ ప్రయోజనాల వేదిక**

కొత్త స్టేడియాన్ని కేవలం క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకే పరిమితం చేయకుండా బహుళ ప్రయోజనాల క్రీడా, ఈవెంట్ వేదికగా తీర్చిదిద్దే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వంటి ప్రముఖ క్రికెట్ వేదికలు, ఆస్ట్రేలియాలోని ఆధునిక స్టేడియాల తరహాలో ప్రేక్షకులకు అత్యున్నత సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించేలా డిజైన్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

క్రికెట్‌తో పాటు ఇతర అంతర్జాతీయ క్రీడా పోటీలు, భారీ సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహించగలిగేలా వేదికను రూపొందించే అవకాశం ఉంది. దీంతో స్టేడియం చుట్టూ హోటళ్లు, రెస్టారెంట్లు, పార్కింగ్, వాణిజ్య సదుపాయాలు, రవాణా వ్యవస్థ వంటి అనుబంధ మౌలిక వసతులు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

**ఫ్యూచర్ సిటీలోనే ఎందుకు?**

భారీ అంతర్జాతీయ స్టేడియానికి కనెక్టివిటీ అత్యంత కీలకం. భారత్ ఫ్యూచర్ సిటీని హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి రహదారి, మెట్రో రైలు కనెక్టివిటీపై కూడా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

ముచ్చెర్ల ప్రాంతాన్ని హైదరాబాద్ విస్తరణలో కీలకమైన 'ఫోర్త్ సిటీ'గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. పెట్టుబడులు, ఆరోగ్యం, విద్య, ఉపాధి, క్రీడలు, పర్యాటకానికి ఈ ప్రాంతాన్ని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుపై బీసీసీఐతో తాను చర్చించినట్లు సీఎం గతంలోనే వెల్లడించారు.

**ప్రపంచస్థాయి స్పోర్ట్స్ హబ్‌గా ఫ్యూచర్ సిటీ**

ఫ్యూచర్ సిటీలో క్రికెట్ ఒక్కటే కాకుండా ఫుట్‌బాల్, గోల్ఫ్ తదితర క్రీడలకు ప్రపంచస్థాయి సదుపాయాలతో సమగ్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ప్రణాళికల్లో ఉంది. 2025లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను సమగ్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఆర్కిటెక్ట్‌ను నియమించి మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగమే. 2024లోనే ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో సమగ్ర క్రీడా హబ్, వివిధ క్రీడలకు అకాడమీలు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ వంటి సదుపాయాల అభివృద్ధిపై ప్రకటన చేసింది.

**బీసీసీఐ–రాష్ట్ర ప్రభుత్వం కలిసి**

ఈ భారీ ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వం, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భాగస్వామ్యంపై చర్చలు జరుగుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం భూమిని సమకూర్చడం, బీసీసీఐ నిర్మాణం, నిర్వహణకు నిధులు సమకూర్చే విధానంపై ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ఆర్థిక నమూనా ఇంకా తుది నిర్ణయానికి రాలేదు.

**ఉప్పల్‌కు తోడు మరో మెగా వేదిక**

ప్రస్తుతం హైదరాబాద్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు ప్రధాన వేదికగా ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఉంది. కొత్త స్టేడియం నిర్మాణం పూర్తయితే నగరానికి మరో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ వేదిక అందుబాటులోకి వస్తుంది. ఐపీఎల్, టెస్టులు, వన్డేలు, టీ20లు, ప్రపంచకప్ వంటి భారీ టోర్నీలకు అదనపు వేదికగా ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా అంతర్జాతీయ మ్యాచ్‌ల కోసం దేశ, విదేశాల నుంచి వేలాది మంది అభిమానులు హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉండటంతో క్రీడా పర్యాటకానికి కూడా ఊతం లభించనుంది. విమానాశ్రయం, ఓఆర్ఆర్, భవిష్యత్ రింగ్‌రోడ్లు, మెట్రో అనుసంధానంతో ఫ్యూచర్ సిటీని క్రీడా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం మరింత బలపడుతుంది.



# నేపాల్ విషాదం

**788కు చేరిన మృతుల సంఖ్య**
**- మొత్తం 2,500 మందికి పైగా గల్లంతు**

**మహా డెస్క్ :** నేపాల్ ఆకస్మిక వరదల ధాటికి మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నేపాల్‌లో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు ఆదివారం తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం, చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్‌లో 194, నవల్పరాసి వెస్ట్‌లో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌లో 52, ధాడింగ్‌లో 50, తునహూన్‌లో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారని, వీరిలో నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్డీఆర్ఆర్ ఎంఏ పేర్కొంది. గుర్తుతెలియని మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులలో భద్రపరిచినట్లు పేర్కొంది. గల్లంతైన వారిలో 933 మంది హైడ్రోపవర్ (జలవిద్యుత్) ప్రాజెక్టు కార్మికులు కాగా, 592 మంది విదేశీయులు, 127 మంది విదేశీ గ్రూపులతో కలిసి ప్రయాణిస్తున్న ప్రయాణిస్తున్న నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్డీఆర్ఆర్ ఎంఏ వెల్లడించింది. నేపాల్ పోలీస్, నేపాల్ ఆర్మీ, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, కస్టమ్స్ ఆఫీస్, ఇమ్మిగ్రేషన్ ఆఫీస్‌కు చెందిన సిబ్బంది కూడా గల్లంతైన వారి జాబితాలో ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని లేదా డిశ్చార్జ్ అయ్యారని పేర్కొంది. వీరికి సేవలు అందించడానికి విపత్తు ప్రాంతంలో 6 ప్రత్యేక శస్త్రచికిత్స వైద్య బృందాలను మోహరించినట్లు తెలిపింది.

# రాయలసీమ పల్లెల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



**అమరావతి, మహా :** రాయలసీమలో గ్రామీణ మౌలిక వసతులు, అటవీ ప్రాంతాల అభివృద్ధి, వ్యవసాయానికి ఊతం, భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పల్లెల సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని రూ.8,022 కోట్లతో గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వెల్లడించారు. రహదారి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూ.4,523 కోట్లతో 23 వేలకు పైగా రోడ్ల పనులను చేపట్టామని, ఇప్పటికే 5,238 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు.

రాయలసీమలోని గ్రామీణ ప్రాంతాలు, ముఖ్యంగా వెనుకబడిన మండలాలు, కొండలు, అటవీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి కేవలం రహదారులు, భవనాల నిర్మాణంతో పూర్తయ్యే అంశం కాదని, వ్యవసాయానికి నీరు, రైతులకు ఉపాధి, పంటలకు మార్కెట్, గ్రామాలకు రవాణా సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

రాయలసీమలో వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాలు అధికంగా ఉండటంతో నీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు నీటి కుంటలు, ఇంకుడు గుంతలు వంటి పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నామని తెలిపారు. వర్షం కురిసిన సమయంలో నీరు వేగంగా వాగుల్లోకి వెళ్లిపోకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే నిల్వ చేసి భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. దీని వల్ల బోర్లు, బావుల్లో నీటి లభ్యత పెరగడంతో పాటు వ్యవసాయానికి కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలకు అనుసంధానం చేస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాయలసీమలో 62 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం అందించామని, దీనివల్ల సుమారు 28 వేల మంది రైతులు లబ్ధి పొందారని చెప్పారు. ఉద్యాన సాగు విస్తరణ ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు లభించడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యం పెంచే పంటలను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని వివరించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారుల నిర్మాణం కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, గ్రామీణ ప్రజలు వైద్య సేవలు పొందేందుకు మెరుగైన రహదారి వ్యవస్థ అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో రూ.4,523 కోట్ల అంచనా వ్యయంతో 23 వేలకు పైగా రోడ్ల పనులను చేపట్టామని వెల్లడించారు. వీటిలో ఇప్పటికే 5,238 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు.

అటవీ ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. రాయలసీమలోని అటవీ ప్రాంతాలు పర్యావరణ సమతుల్యతకు మాత్రమే కాకుండా గ్రామీణ ప్రజల జీవనోపాధికి కూడా కీలకంగా ఉన్నాయి. అటవీ సంరక్షణ, నీటి సంరక్షణ, నేల పరిరక్షణ, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే సమయంలో పర్యావరణ పరిరక్షణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకోవడం అత్యంత ముఖ్యమని ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రతి గ్రామానికి ఒకే తరహా అభివృద్ధి నమూనా కాకుండా అక్కడి భౌగోళిక పరిస్థితులు, నీటి లభ్యత, వ్యవసాయ విధానం, జనాభా అవసరాలు, అటవీ పరిస్థితులకు అనుగుణంగా పనులను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా రాయలసీమలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు.

రాయలసీమలో నీటి సమస్యను పరిష్కరించడానికి పెద్ద ప్రాజెక్టులతో పాటు చిన్న నీటి సంరక్షణ పనులు కూడా సమానంగా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. భారీ నీటి ప్రాజెక్టులు నిర్మించడం ఒక అంశమైతే, గ్రామస్థాయిలో వర్షపు నీటిని నిల్వ చేయడం మరో కీలక అంశమని తెలిపారు. చెరువులు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు వంటి నిర్మాణాల ద్వారా స్థానికంగా నీటిని నిల్వ చేయడం వల్ల భూగర్భ జలాలపై సానుకూల ప్రభావం ఉంటుందని చెప్పారు.

రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉపాధి హామీ పనులను వినియోగించుకోవడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు అదే సమయంలో రైతుల భూముల్లో శాశ్వత ఆస్తులు ఏర్పడేలా పనులను రూపొందించడం వల్ల ప్రభుత్వ వ్యయం మరింత ప్రయోజనకరంగా మారుతుందని తెలిపారు. ఉద్యాన సాగు విస్తరణ దీనికి ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు.

రాయలసీమలో పల్లెల అభివృద్ధిని కేవలం ప్రభుత్వ నిర్మాణ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా తీసుకెళ్లాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రూ.8,022 కోట్లతో గ్రామాలు, అటవీ ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలు, రూ.4,523 కోట్లతో రహదారి పనులు, ఉపాధి హామీ ద్వారా ఉద్యాన సాగు, నీటి సంరక్షణ చర్యలు వంటి కార్యక్రమాలు సమగ్ర గ్రామీణాభివృద్ధికి పునాది వేస్తాయని తెలిపారు.

రాయలసీమలో ఇప్పటికే పూర్తయిన 5,238 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్లతో పాటు మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయడం, చేపట్టిన నీటి సంరక్షణ నిర్మాణాలను సమర్థంగా నిర్వహించడం, ఉద్యాన పంటల రైతులకు తదుపరి దశలో మార్కెటింగ్, ప్రాసెసింగ్ సదుపాయాలను కల్పించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తే ఈ ప్రణాళికలకు మరింత ఫలితాలు వస్తాయి. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణను సమన్వయం చేస్తూ రాయలసీమను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## మేఘాలయలో మిత్రపక్షానికే బీజేపీ గాలం?

- యూడీపీకి చెందిన 9 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు ప్రచారం.
- అమిత్ షాతో భేటీతో మరింత వేడెక్కిన రాజకీయాలు.

షిల్లాంగ్, మహా. : మేఘాలయ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) నేతృత్వంలోని కూటమిలో భాగస్వామిగా ఉన్న యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ)కి చెందిన పలువురు ఎమ్మెల్యేలు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. యూడీపీకి చెందిన తొమ్మిది మంది శాసనసభ్యులు పార్టీ మారే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో కూటమి రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. 60 మంది సభ్యులున్న మేఘాలయ అసెంబ్లీలో యూడీపీకి ప్రస్తుతం 12 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి ఇద్దరు సభ్యులున్నారు. యూడీపీ నుంచి కనీసం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒకేసారి బీజేపీలో విలీనమైతే.. మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల నిబంధనను అందుకునే అవకాశం ఉంటుంది. అలా జరిగితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాకుండా సమూహ విలీనం సాధ్యమవుతుందన్నది రాజకీయ వర్గాల అంచనా. ఫలితంగా అసెంబ్లీలో బీజేపీ బలం రెండంకెలకు చేరే అవకాశం ఉంటుంది.

యూడీపీలో కొంతకాలంగా అసంతృప్తి పెరుగుతోందన్న ప్రచారం ఈ పరిణామాలకు నేపథ్యంగా నిలిచింది. ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు సన్నిహితుడిగా భావించే యూడీపీ అధ్యక్షుడు మెట్‌బా లింగ్డో నాయకత్వంపై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని భావిస్తున్న కొందరు శాసనసభ్యులు ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలను అన్వేషిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

ఈ ఊహాగానాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో యూడీపీ ఎమ్మెల్యేల భేటీ మరింత ఆజ్యం పోసింది. ఇటీవల యూడీపీకి చెందిన పలువురు శాసనసభ్యులు అమిత్ షాను కలవడంతో వారు బీజేపీ వైపు చూస్తున్నారన్న ప్రచారం బలపడింది. అయితే ఈ భేటీకి రాజకీయ ఫిరాయింపులతో ఎలాంటి సంబంధం లేదని యూడీపీ వర్గాలు స్పష్టం చేశాయి. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ), రాష్ట్రానికి సంబంధించిన ఇతర అంశాలపై చర్చించేందుకే కేంద్ర హోంమంత్రిని కలిసినట్లు పార్టీ వివరణ ఇచ్చింది. మేఘాలయలో బీజేపీ, యూడీపీ రెండూ అధికార ఎన్‌పీపీ నేతృత్వంలోని కూటమిలో భాగస్వాములు కావడం తాజా పరిణామానికి మరింత రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తోంది

# ప్రజల ఆకాంక్షలే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **రూ.131.61 కోట్లతో మధిరలో అభివృద్ధి పనులకు శ్రీకారం.**
- **సంక్షేమం, విద్య, వైద్యం, రహదారులకు భారీగా నిధులు.**
- **డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.**



**మధిర, మహా :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు సాగిన పోరాటం ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, రహదారులు, నీటిపారుదల రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

మధిర నియోజకవర్గంలోని చింతకాని, బోనకల్ మండలాల్లో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ప్రజలకు అవసరమైన అంతర్గత సీసీ రోడ్లు, బీటీ రహదారులు, డ్రైనేజీలు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, పీఏసీఎస్ గోదాములు, గ్రామ పంచాయతీ భవనం తదితర పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రెండు మండలాల్లో మొత్తం రూ.131.61 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

చింతకాని మండలం కొదుమూరు ఎస్సీ కాలనీలో రూ.66 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, లచ్చగూడెంలో రూ.29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా లచ్చగూడెం నుంచి నేరడ పీఆర్ రహదారి వరకు, చింతకాని-వందనం ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.75 కోట్లు, లచ్చగూడెం-అనంతారం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. చింతకాని గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.44 లక్షలతో, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాగిలిగొండ నుంచి తూటికుంట్ల వరకు రూ.5.25 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు కూడా శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు రవాణా సౌకర్యాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క తెలిపారు.

బోనకల్ మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో రూ.63 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో మరో రూ.కోటితో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాయన్నపేట ఎస్సీ కాలనీలో రూ.19 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా ప్రారంభం పలికారు. వెనుకబడిన ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.

వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచే చర్యల్లో భాగంగా నారాయణపురంలో రూ.80.84 లక్షలతో నిర్మించిన 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదామును భట్టి విక్రమార్క ప్రారంభించారు. మోటమర్రిలో రూ.24.50 లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదామును కూడా ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని భద్రపరచుకునేందుకు గోదాముల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వ్యవసాయ రంగానికి మౌలిక బలం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

బోనకల్ మండలంలో రహదారి అభివృద్ధికి కూడా పెద్దపీట వేశారు. కలకోట-రాపల్లి-గన్నవరం-ముసలిమడుగు-లక్ష్మీపురం రహదారిని రూ.57 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 20/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు శంకుస్థాపన చేశారు. బ్రాహ్మణపల్లి-గన్నవరం మీదుగా రాపల్లి వరకు ఉన్న పీడబ్ల్యూడీ రహదారిని రూ.26 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 8/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేయనున్న పనులకు కూడా శ్రీకారం చుట్టారు. రాపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా కొనసాగిస్తోందని అన్నారు. రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని వివరించారు.

ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. పేదల జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడం, వారికి భద్రమైన నివాసం కల్పించడం ప్రభుత్వ సంక్షేమ విధానంలో కీలక భాగమని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని భట్టి విక్రమార్క తెలిపారు. తొలి ఏడాదిలోనే 70 వేలకు పైగా నియామక పత్రాలను అందజేశామని చెప్పారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ భద్రత కల్పించడం ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు.

తెలంగాణ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని భట్టి విక్రమార్క అన్నారు. ఇందులో భాగంగా 100 ఇంటిగ్రేటెడ్ గురుకులాలను మంజూరు చేశామని తెలిపారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని రూ.200 కోట్ల వ్యయంతో 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకునేలా ఈ గురుకులాలను రూపొందిస్తున్నామని తెలిపారు. విద్య ద్వారా సామాజిక సమానత్వాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో పరస్పర అవగాహన, సామాజిక ఐక్యత పెంచడం ద్వారా భవిష్యత్ తెలంగాణకు బలమైన పునాది వేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రాష్ట్రంలో మరో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను మంజూరు చేశామని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన పోషకాహారం అందించేందుకు మెస్ చార్జీలను 40 శాతం పెంచామని, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

మధిర నియోజకవర్గంలో ఒకే రోజు రూ.131.61 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగడం గ్రామీణ మౌలిక వసతులపై ప్రభుత్వం పెడుతున్న దృష్టికి నిదర్శనమని అధికారులు తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, విద్య, వ్యవసాయ నిల్వ సదుపాయాలు, గ్రామ పంచాయతీ భవనాలు వంటి ప్రాథమిక అవసరాలకు నిధులు కేటాయించడం ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గప్రసాద్, విద్యుత్ శాఖ సీఈ అశోక్, ఎస్ఈ శ్రీనివాసచారి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యుగంధర్‌రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, సీపీఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాణీ కపూర్ స్టైలిష్ లుక్

బాలీవుడ్ నటి వాణీ కపూర్ మరోసారి తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. సంప్రదాయ వస్త్రధారణలోని అందాన్ని ఆధునిక ఫ్యాషన్ శైలితో మేళవించిన ప్రత్యేకమైన హైఫ్యాషన్ దుస్తుల్లో ఆమె మెరిసింది. వాణీ ధరించిన ఆలివ్‌గోల్డ్ రంగు ప్లీటెడ్ గౌన్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హార్ట్ షేప్ బాడీస్‌తో రూపొందించిన ఈ గౌన్‌కు అసమానంగా డిజైన్ చేసిన లేస్ అంచుల షోల్డర్ ర్యాప్‌ను జోడించారు. దీంతో సంప్రదాయ డ్రేప్ శైలిని గుర్తుచేస్తూనే, పూర్తిగా ఆధునికమైన ఫ్యాషన్ లుక్‌ను ఆమె సొంతం చేసుకుంది.

వాణీ ఈ దుస్తులను ఎంతో హుందాగా క్యారీ చేసింది. ముఖ్యంగా ఆమె ఎంచుకున్న హెయిర్‌స్టైల్ మొత్తం లుక్‌కు మరింత క్లాసిక్ టచ్‌ను తీసుకొచ్చింది. జుట్టును చక్కగా లో బన్‌గా స్టైల్ చేసుకోవడంతో ఆమె ముఖ సౌందర్యం మరింత స్పష్టంగా కనిపించింది. అలాగే వెచ్చని మెటాలిక్ షేడ్స్‌తో చేసిన ఐ మేకప్ ఆమె కళ్లకు ప్రత్యేకమైన ఆకర్షణను తీసుకొచ్చింది. గోల్డ్ జ్యువెలరీని జోడించడంతో మొత్తం లుక్ మరింత రిచ్‌గా కనిపించింది.

సింపుల్ టచ్‌లతోనే గ్లామర్‌ను హైలైట్ చేయడం వాణీ లుక్‌లో ప్రత్యేకంగా కనిపించింది. దుస్తులు, మేకప్, హెయిర్‌స్టైల్, ఆభరణాల మధ్య మంచి సమన్వయం కనిపించడంతో ఆమె స్టైల్ మరింత ఆకట్టుకునేలా మారింది. తన పొడవైన ఆకృతికి సరిపోయేలా డిజైన్ చేసిన ఈ గౌన్‌లో వాణీ ఎంతో స్టైలిష్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపించింది. ఫ్యాషన్ ఫొటోషూట్‌లో ఆమె ఇచ్చిన పోజులు కూడా అభిమానులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

వాణీ కపూర్ కేవలం ఫ్యాషన్ ప్రపంచంలోనే కాకుండా నటిగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనా సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. కమర్షియల్ సినిమాలతో పాటు విభిన్నమైన కథాంశాలు ఉన్న చిత్రాల్లోనూ నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది.

'వార్' వంటి భారీ యాక్షన్ చిత్రంలో నటించడం ద్వారా వాణీకి మరింత గుర్తింపు వచ్చింది. అనంతరం 'చండీగఢ్ కరే ఆశికీ' వంటి విభిన్నమైన కథాంశంతో తెరకెక్కిన సినిమాలోనూ తన నటనతో ఆకట్టుకుంది. కమర్షియల్ హీరోయిన్ ఇమేజ్‌కు మాత్రమే పరిమితం కాకుండా విభిన్నమైన పాత్రలు చేయాలనే ఆసక్తిని ఈ సినిమాల ద్వారా చూపించింది.

ఇటీవల 'ఖేల్ ఖేల్ మేన్' చిత్రంలోనూ వాణీ కనిపించింది. కామెడీ, డ్రామా అంశాలతో రూపొందిన ఈ సినిమాలోని నటీనటుల బృందంలో ఆమె భాగమైంది. ఆ తర్వాత 'రైడ్ 2' వంటి క్రైమ్ డ్రామాలో నటించింది. విభిన్న జానర్లలో సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది.

'అబీర్ గులాల్' వంటి రొమాంటిక్ చిత్రంతోనూ వాణీ ప్రేక్షకులను పలకరించింది. దీంతో ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా విభిన్నమైన కథలను ఎంచుకుంటున్న నటిగా ఆమెకు గుర్తింపు పెరుగుతోంది. రాబోయే రోజుల్లో 'బద్తమీజ్ గిల్', 'సర్వగుణ సంపన్న' వంటి ప్రాజెక్టులతోనూ ఆమె ప్రేక్షకుల ముందుకు రానుంది.

వాణీ కపూర్ కెరీర్‌ను పరిశీలిస్తే నటనతో పాటు ఫ్యాషన్ విషయంలోనూ ఆమె ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకున్నట్లు కనిపిస్తోంది. సినిమా ప్రమోషన్లు, ఫ్యాషన్ ఈవెంట్లు, రెడ్ కార్పెట్ కార్యక్రమాల్లో ఆమె ఎంచుకునే దుస్తులు తరచూ చర్చనీయాంశంగా మారుతున్నాయి. సంప్రదాయ అందాన్ని ఆధునిక డిజైన్లతో కలిపి తనదైన శైలిని ప్రదర్శించడం ఆమెకు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

తాజాగా ఆలివ్‌గోల్డ్ గౌన్‌లో కనిపించిన లుక్ కూడా ఇదే విషయాన్ని మరోసారి రుజువు చేసింది. హుందాతనం, గ్లామర్, ఆధునికత కలగలిపిన ఈ లుక్‌లో వాణీ ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. దీంతో ఆమె తాజా ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒకవైపు వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తోనూ వార్తల్లో నిలుస్తోంది.

నటనలో విభిన్నతను చూపిస్తూ, ఫ్యాషన్‌లో తనదైన ముద్ర వేస్తున్న వాణీ కపూర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆసక్తికరమైన కెరీర్‌ను కొనసాగిస్తోంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న ఆమె నుంచి రాబోయే సినిమాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.





# ఆనంద్ ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని నటుడు ఆనంద్ దేవరకొండ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులు మళ్లీ థియేటర్లకు వచ్చి సినిమాలను ఆసక్తిగా చూడటం సినీ పరిశ్రమకు మంచి పరిణామమని అన్నారు. వరుసగా విభిన్నమైన కథలు, మంచి కంటెంట్‌తో సినిమాలు విడుదలవుతుండటంతో ప్రేక్షకుల్లో కూడా సినిమాలపై ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్నారు. ఇటీవల 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'చెన్నై లవ్ స్టోరీ', 'ఇరుముడి' వంటి భిన్నమైన నేపథ్యాలు, జానర్లతో వచ్చిన చిత్రాలకు ప్రేక్షకుల నుంచి స్పందన లభించడం పట్ల ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. చిన్న చిత్రం, పెద్ద చిత్రం అనే తేడా లేకుండా మంచి కథతో వచ్చే ప్రతి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తే పరిశ్రమ మరింత బలపడుతుందని అన్నారు. వారాంతంలో ఏ కొత్త సినిమా విడుదలవుతుందో తెలుసుకునేందుకు ప్రేక్షకులు టికెట్ బుకింగ్ యాప్‌లను పరిశీలిస్తున్న పరిస్థితి రావడం సానుకూల మార్పుకు సంకేతమని చెప్పారు.

సినిమాలో విషయం బాగుంటే ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారని ఆనంద్ పేర్కొన్నారు. గతంలో కొన్ని సందర్భాల్లో కొత్త సినిమాలపై ప్రేక్షకుల్లో పెద్దగా ఆసక్తి కనిపించలేదని, ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందని అన్నారు. థియేటర్లలో ప్రేక్షకుల సందడి పెరగడం పరిశ్రమకు ఉత్సాహాన్ని ఇస్తోందని, ఈ సానుకూల వాతావరణం కొనసాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇక తన కుటుంబానికి సంబంధించిన విషయాలను కూడా ఆనంద్ దేవరకొండ పంచుకున్నారు. తన అన్న విజయ్ దేవరకొండ భార్య రష్మికను తాను ఆప్యాయంగా 'రుషి' అని పిలుస్తానని చెప్పారు. ఆమె తనకంటే చిన్నది కావడంతో ఆ పేరుతోనే పిలవడం అలవాటైందని తెలిపారు. షూటింగ్ పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చినప్పుడు రష్మికకు సినిమాలు, షూటింగ్, పని విషయాల గురించి చర్చించడం పెద్దగా ఇష్టం ఉండదని ఆనంద్ వెల్లడించారు. తాను, విజయ్ మాత్రం తండ్రి ఇంట్లో ఉన్నప్పుడు అప్పుడప్పుడు వృత్తిపరమైన విషయాల గురించి మాట్లాడుకుంటామని చెప్పారు. అయితే రష్మిక మాత్రం ఇంటికి చేరుకున్న తర్వాత పూర్తిగా వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. పని, వ్యక్తిగత జీవితం రెండింటినీ స్పష్టంగా వేరు చేసుకోవడం రష్మికలోని మంచి లక్షణమని ఆనంద్ అన్నారు. ఇంటికి వచ్చిన తర్వాత ప్రశాంతంగా తన సమయాన్ని గడుపుతూ, వృత్తిపరమైన విషయాలను పక్కన పెట్టే ఆమె తీరు తమకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ఆమె నుంచి తాము చాలా నేర్చుకోవాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఆనంద్ దేవరకొండ నటించిన 'ఎపిక్' చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తన గత చిత్రాలతో పోలిస్తే భిన్నమైన అనుభూతిని అందించేలా ఉంటుందని, కథ, పాత్ర విషయంలో కొత్తదనం కనిపిస్తుందని ఆనంద్ వెల్లడించారు. సినిమా విడుదల కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

# ఐదు నెలల్లో రజినీ సినిమా

సీనియర్ స్టార్ హీరోతో సినిమా చేయాలంటే సాధారణంగా షూటింగ్ పూర్తయ్యేందుకు చాలా సమయం పడుతుంది. ఇక పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించే చిత్రాలకు ఈ వ్యవధి మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో సినిమా చేస్తున్న యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాత్రం వేగంగా షూటింగ్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కేవలం ఐదు నెలల్లోనే చిత్రీకరణను ముగించి, వచ్చే సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ విధానం చూస్తే తక్కువ సమయంలో సినిమాలను పూర్తి చేసి త్వరగా విడుదల చేయడంలో పేరున్న టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి గుర్తుకు రావడం సహజమే. ఇప్పుడు అదే తరహాలో కోలీవుడ్‌లో అశ్వత్ మారిముత్తు రజినీకాంత్‌తో పనిచేస్తున్నారు. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న అశ్వత్‌కు రజినీకాంత్ స్వయంగా అవకాశం ఇచ్చినట్లు సమాచారం. పలువురు దర్శకుల పేర్లను పరిశీలించిన అనంతరం 'తలైవర్ 173' బాధ్యతలను ఆయనకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి 'ధర్మన్: ది డెడ్లీ డాక్టర్' అనే టైటిల్‌ను మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. జూన్‌లో షూటింగ్ ప్రారంభమైన ఈ సినిమాలో సిమ్రాన్, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. రామ్ పోతినేని కీలక పాత్రలో కనిపించనున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తికాగా, ప్రస్తుతం రెండో షెడ్యూల్ చిత్రీకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అశ్వత్ మారిముత్తు తన సినిమాకు సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు. రజినీకాంత్‌తో సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పిన ఆయన, ఈ చిత్రాన్ని అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అంటే జూన్‌లో ప్రారంభమైన షూటింగ్‌ను కేవలం ఐదు నెలల్లోనే ముగించేందుకు దర్శకుడు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారన్నమాట. రజినీకాంత్ వంటి సీనియర్ స్టార్‌తో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమాను ఇంత తక్కువ సమయంలో పూర్తి చేయాలనే ప్రయత్నం ప్రస్తుతం కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. షూటింగ్ అనుకున్న సమయానికి పూర్తయితే 'ధర్మన్'ను వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రజినీకాంత్ ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు అశ్వత్ మారిముత్తు తన తదుపరి ప్రాజెక్ట్‌ను శింబుతో చేయనున్నట్లు సమాచారం. వాస్తవానికి రజినీకాంత్ సినిమాకు ముందే శింబుతో సినిమా చేయాల్సి ఉందట. అయితే శింబు నటిస్తున్న 'అరసన్' షూటింగ్ ఆలస్యం కావడంతో అశ్వత్ ముందుగా రజినీకాంత్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా 'దయానగరం' అనే సినిమాలో అశ్వత్ చిన్న పాత్రలో కనిపించనున్నట్లు కూడా సమాచారం. మొత్తంగా రజినీకాంత్‌తో చేస్తున్న పాన్ ఇండియా చిత్రాన్ని కేవలం ఐదు నెలల్లో పూర్తి చేసి సంక్రాంతికి విడుదల చేయాలనే అశ్వత్ మారిముత్తు ప్రణాళిక ఇప్పుడు కోలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతోంది.



# అరియానా ఆవేదన

బిగ్‌బాస్ ఫేమ్, నటి అరియానా గ్లోరీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. యాంకర్ రవి పాడ్‌కాస్ట్ స్టూడియో ప్రారంభోత్సవానికి హాజరైన ఆమె.. తన గృహప్రవేశం సమయంలో ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. శుభకార్యాల సమయంలో కొందరు హిజ్రాలు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆశీర్వాదం ఇవ్వాలనుకుంటే సంతోషంగా ఇవ్వాలని, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం సరికాదని అన్నారు. తన వ్యాఖ్యలు ఎవరినీ కించపరిచేందుకు కాదని స్పష్టం చేసిన అరియానా.. గౌరవంగా జీవించేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలకు పలువురు నెటిజన్లు మద్దతు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకుంటున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com